



తెనాలిలో డయేరియా.. కలకలం

- గుంటూరులో చికిత్స పొందుతూ మహిళ మృతి
- మరో 20 మందికిపైగా ఆస్పత్రుల్లో చికిత్సలు
- సమాచారం ఇచ్చినా పట్టించుకోని మున్సిపాలిటీ
- నెల నుంచి కలుషిత నీరు వస్తుందంటున్న ప్రజలు
- బాధితులను పరామర్శించిన నాదెండ్ల



మృతురాలు లక్ష్మి కోడలు కలుషిత నీటి పరిస్థితి వివరిస్తున్న చిత్రం

తెనాలి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): తెనాలిలోని గురవయ్యకాలనీకి మున్సిపాలిటీ సరఫరా చేసే తాగునీరు కొద్ది రోజులుగా రంగుమారి, వాసన వస్తుంది. ఈ విషయాన్ని మున్సిపల్ సిబ్బందికి మొరపెట్టుకున్నారు. చెప్పినరోజు నీటి సరఫరా ఆపేయడం, ఆ తర్వాత పునరుద్ధరించినా మురుగు నీటి వాసన పోలేదు. ఈ పరిస్థితుల్లో అదే నీటిని కాచి చల్లార్చి తాగామని, అయినా ఫలితం లేకపోయిందని, వాంతులు, విరేచనాలతో ఆస్పత్రులకు వెళ్లాల్సి వచ్చిందని కాలనీవాసులు చెబుతున్నారు. గురవయ్యకాలనీ, పూలే కాలనీ, సుల్తానాబాద్, మరికొన్ని శివారు కాలనీల్లోనూ డయేరియా కేసులు భారీగానే నమోదయ్యాయి. పది రోజుల క్రితమే సుమారు 25 మంది వరకు ప్రభుత్వ, ప్రైవేటు వైద్యశాల్లో చికిత్స పొందారు. అయితే డయేరియా అని నమోదు చేయకుండా మున్సిపల్ అధికారులు జాగ్రత్త పడ్డారే కానీ, ప్రజల్ని కాపడటానికి మాత్రం ఏ చర్యలూ తీసుకోలేదు.

ఒక మహిళ మృతి... ఆస్పత్రుల్లో బాధితులు

గురవయ్యకాలనీకి చెందిన బండి లక్ష్మి(60) అనే మహిళ చనిపోతే, మరో 20మంది గుంటూరు జిల్లా వైద్యశాలలో, మరికొందరు ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారని సమాచారం. మూడు రోజుల క్రితం వాంతులు, విరేచనాలతో తెనాలి జిల్లా వైద్యశాలలో లక్ష్మి చేరగా, మెరుగైన వైద్యం కోసం గుంటూరుకు అదేరోజు పంపారు. అక్కడికి వెళ్లిన గంటకే ఆమె చనిపోయినట్లు లక్ష్మి కోడలు తెలిపారు. ఆమెతోపాటే మరో 15మంది వరకు ఆస్పత్రుల్లో చేరారని బాధితులు చెబుతున్నారు. పూలే కాలనీ నుంచి ఇద్దరు, సుల్తానాబాద్‌కు చెందిన నలుగురు గుంటూరు ప్రభుత్వవైద్యశాలలో చికిత్స పొందుతున్నారని, శుక్రవారమే ఇంటికి వచ్చిన కొందరు బాధితులు తెలిపారు. మరో ఏడుగురు ప్రైవేటువైద్యశాలల్లో చేరినట్లు తెలిపారు.

నెల నుంచే నీటి సరఫరా సరిగాలేదని, రంగు మారి వాసన వస్తుందని మున్సిపల్ అధికారులకు చెప్పినా పట్టించుకోకుండా, కనీసం నీటి నమూనాలు సేకరించి పరీక్షలకు పంపకుండా వదిలేయడం విమర్శలకు తావిస్తోంది. రెండు రోజుల నుంచి భారీగా డయేరియా లక్షణాలతో కేసులు వస్తున్నాయని, తెనాలి జిల్లా వైద్యశాల సిబ్బంది, ప్రైవేటు ఆస్పత్రుల సిబ్బంది సమాచారం ఇచ్చినా మున్సిపల్ ప్రజారోగ్య విభాగం పూర్తిగా గాలికొదిలేసింది. శుక్రవారం నాదెండ్ల మనోహర్ కాలనీల్లో పర్యటనకు వెళ్లిన సమయంలో బాధితులు వివరించటంతో ఆయన దీనిపై ఘాటుగా స్పందించారు. జనం చచ్చిపోతుంటే, ప్రజాప్రతినిధి విందు రాజకీయాల్లో బిజీగా ఉన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్ అధికారులు కూడా ప్రజారోగ్యాన్ని గాలికొదిలేశారని విమర్శించారు.

అమరేశ్వరాలయంలో చోరీ

అమ్మవారి హుండీ పగలకొట్టిన దుండగుడు



అమ్మవారి ఆలయంలో చోరీకి గురైన హుండీ



గడ్డపలుగుతో ఆలయంలోకి ప్రవేశించిన దుండగుడు సీసీ కెమేరాలో రికార్డు అయిన దృశ్యం

అమరావతి, ఫిబ్రవరి 23: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అమరావతిలోని బాలచాముండికా సమేత అమరేశ్వరాలయంలో గురువారం అర్ధరాత్రి చోరీ జరిగింది. అమ్మవారి ఆలయం వద్ద ఉన్న స్టీల్ హుండీ తాళాన్ని గడ్డపొలుగుతో పగలకొట్టి భక్తులు సమర్పించిన కానుకలు, నగదును చోరీ చేశారు. హుండీలోని నోట్లను తీసుకుని చిల్లర నాణాలు వదలి వెళ్లాడు. ఉదయాన్నే ఆలయం తెరిచిన అర్చకులు, వాచ్‌మన్లు తాళం పగలగొట్టిన హుండీని చూసి చోరీ జరిగినట్లు గుర్తించారు. వెంటనే ఆలయ అధికారికి ఫోన్ చేసి సమాచారమిచ్చారు. ఈవో వేమూరి గోపి ఫిర్యాదుతో సీఐ బ్రహ్మం సిబ్బందితో సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈవో కార్యాలయంలో ఉన్న సీసీ ఫుటేజిని పరిశీలించారు. రాత్రి 1గంట సమయంలో గుర్తుతెలియని అగంతకుడు గడ్డపార, దుప్పటి పట్టుకుని ఆలయ మూడో ప్రాకారంలోని ఉత్తర గాలిగోపురం నుంచి ప్రవేశించి వెంకటాద్రినాయుడు మండపం వద్ద గేటుకు ఉన్న తాళం తొలగించి లోపలికి ప్రవేశించినట్లు సీసీ కెమేరాలో రికార్డు అయ్యింది. చోరీకి సంబంధించి కేసు నమోదు చేశారు. హుండీలో సుమారు 50 వేల వరకు నగదు అపహరించుకు పోయి ఉంటారని అనుమానిస్తున్నారు. ఆలయంలో ఇద్దరు నైట్ వాచ్‌మన్లు, మొదటి ప్రాకారంలో భక్తులు పడుకుని ఉన్నప్పటికీ దొంగతనం జరిగింది. ఈ పరిస్థితుల్లో ఆలయ భద్రతపై భక్తులు ఆందోళన చెందుతున్నారు.

వసతి వెతలు

- సంక్షేమ హాస్టళ్లకు ఆరునెలలుగా భోజన బిల్లులు చెల్లించని ప్రభుత్వం
- ఎస్సీ, బీసీ, ఎస్టీ వసతి గృహాలకు రూ.16 కోట్లకు పైగా బకాయి
- కాస్మొటిక్ ఛార్జీలు చెల్లించని వైనం
- భోజన పట్టిక అమలు చేయలేని స్థితిలో నిర్వాహకులు
- అర్ధాకలితో అలమటిస్తున్న విద్యార్థులు

నా ఎస్సీలు.. నా ఎస్టీలు.. నా బీసీలు అంటున్న సీఎం జగన్ ఆయా వర్గ విద్యార్థుల సంక్షేమాన్ని గాలి కొదిలేశాడు. పేరుకే నా అంటూ.. వారిని నిండా మోసం చేస్తున్నాడు. సదరు విద్యార్థుల సంక్షేమాన్ని సంక్షోభంలోకి నెట్టివేశాడు. విద్యార్థుల భోజన బిల్లులు నెలల తరబడి చెల్లించడంలేదు. అర్ధాకలితో విద్యార్థులు అలమటిస్తున్నారు. చివరకు తలనూనెకు ఇంటి నుంచి డబ్బు తెచ్చుకోవాల్సిందే. కాస్మొటిక్ ఛార్జీలు చెల్లించడంలేదు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ వసతి గృహాలకు రూ.16 కోట్లకు పైగా బిల్లుల బకాయిలు పేరుకుపోయాయి. విద్యార్థుల కడుపు మాడ్చలేక.. అప్పులు తీర్చలేక.. వసతి గృహాల అధికారులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. వారు అప్పుల ఊబిలో కూరుకుపోయారు. కనీసం సరుకుల కొనుగోలుకు అప్పులు పుట్టని దుస్థితిని ఎదుర్కొంటున్నారు.

> ఆరునెలలుగా వసతి గృహాలకు భోజన బిల్లులు చెల్లించలేదు. హాస్టల్స్‌ను ఎలా నిర్వహించగలం. మా పరిస్థితి పగవాడికి కూడా రాకూడదు. ప్రభుత్వం డైట్ బిల్స్‌కు గ్రీన్‌ఛానల్ ఉందని చెబుతున్నా బిల్లులు చెల్లించడంలేదు. సహాయక సంక్షేమాధికారి వారి లాగిన్ నుంచి బిల్స్ ట్రెజరీకి అప్‌లోడ్ కాకుండా నిలిపివేశారు. మా 26 ఏళ్ల సర్వీసులో ఇంత దారుణం ఎప్పుడూ చూడలేదు.
> - ఓ వసతి గృహ నిర్వాహకుని ఆవేదన

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ప్రభుత్వ వసతి గృహాల నిర్వహణపై నిర్లక్ష్యం అలముకుంది. వేలాదిమంది విద్యార్థుల సంక్షేమానికి పాలకులు గండికొడుతున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో సంక్షేమ హాస్టళ్లలో తొమ్మిదివేల మంది విద్యార్థులు ఉంటూ చదువుకొంటున్నట్లు సాంఘిక సంక్షేమ శాఖ లెక్కలు తెలియజేస్తున్నాయి. ఆరునెలలుగా వసతి గృహాల బిల్లులు ప్రభుత్వం విడుదల చేయలేదు. రూ.16 కోట్ల బకాయిలు పేరుకుపోయాయి. కాస్మొటిక్ ఛార్జీలకు సదరు విద్యార్థులు నోచుకోలేదు. వసతి గృహాల నిర్వహణకు సంబంధించిన నిధుల్లో 60శాతం కేంద్ర ప్రభుత్వం చెల్లిస్తుంది. ఈ నిధులను ప్రభుత్వం పక్కదారి పట్టించడంతో బిల్లులు చెల్లించలేని దుస్థితి ఏర్పడింది.

ఖర్చు నెలకు రూ.2,200.. ఇచ్చేది రూ.1,400

కళాశాలల విద్యార్థులకు నెలకు రూ.1,600, స్కూల్స్ విద్యార్థులకు నెలకు రూ.1,400 భోజనం కోసం ప్రభుత్వం చెల్లిస్తోంది. కళాశాలల విద్యార్థులకు రోజు వసతి గృహంలో ఉదయం టిఫిన్, రెండు పూటల భోజనం అందించాలి. స్కూల్స్ విద్యార్థులకు ఉదయం టిఫిన్, ఒక పూట భోజనం, సాయంత్రం స్నాక్స్ అందించాలి. స్కూల్స్ సెలవు రోజుల్లో రెండు పూటలా భోజనం వడ్డించాలి. కళాశాలల విద్యార్థులకు రోజుకు రూ.53.33, స్కూల్ విద్యార్థులకు రోజుకు రూ.46.66కు భోజనం, ఉదయం టిఫిన్ అందించాలి. ఉదయం అల్పాహారం రోజుకో రకం వేరుశనగ చట్నీతో, బెల్లంతో రాగి జావ, చిక్కీలు, రాత్రి భోజనం, అరటి పండు, వారంలో మూడు రోజుల చికెన్, ఆరు రోజులు ఉడికించిన గుడ్డు ఇవ్వాలి. పాలు అందించాలి. ఇలా మెనూ అమలుకు ఒక్కో విద్యార్థికి నెలకు రూ.2,200 ఖర్చు అవుతున్నట్టు నిర్వాహకులు చెబుతున్నారు. మెనూ ఛార్జీలు పెంచాలని పదే పదే వినతిపత్రాలు అందిస్తున్నా ప్రభుత్వం స్పందించడం లేదని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మెనూ ప్రకారం ఇవ్వాలంటే తమ జీతాలు కూడా సరిపోవని కొందరు నిర్వాహకులు చెబుతున్నారు. ప్రభుత్వం వసతి గృహాల్లో భోజనానికి సంబంధించి సరుకుల ధరలు మార్కెట్ కనుగుణంగా పెంచకుండా విద్యార్థుల కడుపు కాల్చుతోంది.

ధరలకు పొంతన లేదు..

వసతి గృహాలకు ప్రభుత్వం చెల్లించే సరుకుల ధరలకు మార్కెట్ ధరలకు పొంతనే లేదు. మార్కెట్‌లో సరకుల ధరలు రోజు రోజుకు పెరుగుతున్నాయి. కూరగాయల ధరలు ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు.సరుకులు, గ్యాస్, పాలు అప్పు పద్ధతిలో కొనుగోలు చేసి బిల్లులు విడుదలైన సమయంలో వాటిని వసతి గృహాల అధికారులు చెల్లించేవారు. ఆరు నెలలుగా మెస్ బిల్లులు విడుదల కాకపోతుండటంతో షాపుల్లో అప్పు దొరకడం లేదు. ఈ నేపథ్యంలో నిర్దేశించిన భోజన పట్టికను అమలు చేయలేక పోతున్నారు. అప్పులకు వడ్డీలు పెరుగుతుండటంతో వారు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

అప్పులు పుట్టక అవస్థలు..

ఆరు నెలలుగా బిల్లులు విడుదల కాకపోవడంతో విద్యార్థులకు ఆహారం అందించడంలో హెచ్‌డబ్ల్యూవోలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. వంద మంది విద్యార్థులు ఉంటే నెలకు రూ.1.20 లక్షలు ఖర్చు అవుతోందని చెబుతున్నారు. ఇలా లెక్కిస్తే వంద మంది విద్యార్థులు ఉన్న వసతి గృహానికి ఈ నెల వరకు రూ.7.20 లక్షలు చెల్లించాల్సి ఉంది. వారికి వచ్చే జీతం కూడా సరుకుల కోసం వెచ్చించాల్సి వస్తోందని వాపోతున్నారు. బంగారం కుదువ పెట్టి కూడా అప్పులు చేస్తున్నవారు ఉన్నారు.

బియ్యం కొనుగోలుకు సొంతంగా చెల్లించాల్సిందే...

వసతి గృహాలకు డీలర్ల ద్వారా బియ్యం సరఫరా చేస్తారు. కిలో రూపాయి చొప్పున డీడీ రూపంలో చెల్లిస్తేనే బియ్యం వసతి గృహాలకు సరఫరా చేస్తారు. 20 కింటాళ్ల బియ్యం కొనుగోలు చేయాలంటే రూ.2వేలు డీడీ చెల్లించాలి. గతంలో ప్రభుత్వం బియ్యం కోసం డబ్బు చెల్లించేది. ఈ ప్రక్రియ కూడా నిలిచిపోయింది. హెచ్‌డబ్ల్యూవోలు వారి సొంత డబ్బు చెల్లించి బియ్యం కొనుగోలు చేయాల్సిన దుస్థితిని ఎదుర్కొంటున్నారు. గ్యాస్ అప్పు లభించే పరిస్థితి లేదు. గ్యాస్ కూడా నిర్వాహకులే కొనుగోలు చేస్తున్నారు. సరుకులు, పాలు, కూరగాయలు అప్పుపై సరఫరా చేసే అవకాశం ఉంది. అయితే నెలల తరబడి బిల్లులు చెల్లించకపోవడంతో వాటికి సరఫరా కూడా కొన్ని వసతి గృహాలకు నిలిచిపోయింది.

ఎస్సీ శాఖ ముఖ్యకార్యదర్శిని కోరినా..

బిల్లులు చెల్లించాలని పదే పదే కోరుతున్నా హెచ్‌డబ్ల్యూవోల మొర ఆలకించే వారే కరువయ్యారు. ఇటీవల ఎస్సీ శాఖ ముఖ్య కార్యదర్శి, డైరెక్టర్ నిర్వహించిన సమావేశంలో బిల్లుల బకాయిల అంశాన్ని హెచ్‌డబ్ల్యూవోలు ప్రస్తావించారు. బిల్లులు చెల్లించాలని కోరినా వారు నేటికీ స్పందించక పోవడం గమనార్హం. ఈ నేపథ్యంలో బిల్లులు తక్షణమే చెల్లించకపోతే వసతి గృహాలను మూసివేయాలని సదరు అధికారుల సంఘం నిర్ణయించింది. ఈమేరకు సాంఘిక సంక్షేమ శాఖ కార్యదర్శిని కలసి లేఖ ఇవ్వాలని యూనియన్ నిర్ణయించినట్టు వారు చెబుతున్నారు. ఇదే జరిగితే విద్యార్థులు వసతి గృహాల నుంచి ఇంటికి వెళ్లాల్సి వస్తుంది.

కాస్మొటిక్ ఛార్జీలు చెల్లించలేదు..

ప్రభుత్వం విద్యార్థులకు నెలవారీ కాస్మొటిక్ ఛార్జీల నగదు ఇవ్వడం లేదు. దీంతో తలనూనె కొనాలన్నా, సబ్బు కావాలన్నా ఇంటి వైపు చూడక తప్పడంలేదు. ప్రతి నెలా తమ తల్లిదండ్రులను ఖర్చులకు డబ్బులు పంపమని అడగడం పరిపాటిగా మారింది. వసతి గృహాల్లోని విద్యార్థులకు ప్రతి నెలా కాస్మొటిక్ ఛార్జీల కింద 3 నుంచి 6వ తరగతి బాలికలకు రూ.110, బాలురకు రూ.100 అందజేయాలి. 7 నుంచి 10వ తరగతి వరకు బాలికలకు రూ.160, బాలురకు రూ.125 చొప్పున తల నూనె, సబ్బులు ఇతర సామాగ్రి కొనుగోలుకు ఇస్తుంది. బాలురకు రూ.30 చొప్పున హెయిర్ కటింగ్ ఛార్జీల కింద అదనంగా విడుదల చేస్తుంది. విద్యార్థుల బ్యాంకు ఖాతాలకే నేరుగా కాస్మొటిక్ ఛార్జీలను జమ చేయాలి. ఆరు నెలలుగా ఛార్జీల ఊసేలేదు.

కనీస వసతులకు నిధులు లేవు..

వసతి గృహాల నిర్వహణకు నిధులు విడుదల కావడంలేదు. కొన్ని నెలలుగా ఇదే పరిస్థితులను ఎదుర్కొంటున్నట్లు నిర్వాహకులు వాపోతున్నారు. చివరకు మాడిపోయిన బల్బును మార్చాలన్నా వారి జేబులో నుంచి ఖర్చు చేయాల్సిందే. మరుగుదొడ్ల నిర్వహణ, తాగునీటి, అవసరమైన మరమ్మతులకు ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కావడంలేదు. కనీస వసతులకు హెచ్‌డబ్ల్యూవోలు సొంతంగా ఖర్చు చేయాల్సిన దుస్థితి నెలకొందన్న విమర్శలున్నాయి.

బీసీ, ఎస్టీ వసతి గృహాలకు బిల్లుల బకాయి

ఎస్సీలే కాదు బీసీ, ఎస్టీ వసతి గృహాలకు కూడా నెలల తరబడి భోజన బిల్లులు చెల్లిండంలేదు. ఈ విద్యాసంవత్సరంలో ఆయా వసతి గృహాలకు అక్టోబరు వరకే బిల్లులు చెల్లించినట్టు సదరు అధికారులు తెలిపారు. దాదాపు నాలుగునెలలుగా బీసీ, ఎస్టీ వసతి గృహాలకు బిల్లులు నిలిచిపోయాయి. ఉమ్మడి గుంటూరు జిల్లాలో బిల్లులు చెల్లించక పోవడంతో నిర్వాహకులు తీవ్రంగా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బీసీ వసతి గృహాలకు రెండు మూడింటికి ఒకే అధికారి ఉన్నారు. దీంతో బకాయిలు పేరుకుపోవడంతో వసతి గృహాల నిర్వహణ ప్రశ్నార్థకంగా మారుతోంది. ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేస్తే బిల్లులు విడుదల కావన్న ఆందోళన వసతి గృహాల అధికారుల్లో నెలకొంది.



నరసరావుపేటలోని సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహం

ఫ్లెక్సీల రగడ

- గుంటూరు, మంగళగిరిలో ఉద్రిక్తత
- గుంటూరులో పెమ్మసాని ఫ్లెక్సీలపై వైసీపీ ఫ్లెక్సీలు
- మంగళగిరిలో టీడీపీ ఫ్లెక్సీలపై అధికారుల ఉక్కుపాదం
- అధికారులు, వైసీపీ నేతల తీరుపై టీడీపీ నేతల ఆగ్రహం



టీడీపీ నేత ఫ్లెక్సీపై తొలగించిన వైసీపీ ఫ్లెక్సీ



గుంటూరు: జీఎంసీ ఎదుట బైఠాయించి పోలీసులతో మాట్లాడుతున్న నసీర్ అహ్మద్

గుంటూరు, మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 23: ఎన్నికల సమీపిస్తున్న తరుణంలో ఫ్లెక్సీల వివాదాలు తారాస్థాయికి చేరుకుంటున్నాయి. ప్రధాన రహదారుల నుంచి సందుగొందుల వరకు స్తంభాలు ఫ్లెక్సీలతో నిండిపోతున్నాయి. ఫ్లెక్సీల ప్రచారంతో వైసీపీ నేతలు దూసుకుపోతున్నారు. తామేమీ తీసిపోమన్నట్లుగా టీడీపీ నేతలు ఎక్కడికక్కడ ఫ్లెక్సీల వేస్తున్నారు. దీనిని జీర్ణించుకోలేని వైసీపీ నేతలు టీడీపీ ఫ్లెక్సీలను అధికారులచేత తొలగింపచేయడమో, లేదంటే వాటిపై తమ నేతల ఫ్లెక్సీల వేయడమో చేస్తున్నారు. దీనిపై టీడీపీ నాయకులు మండిపడుతున్నారు. గుంటూరు, మంగళగిరిలో శుక్రవారం చోటుచేసుకున్న పరిణామాలు ఉద్రిక్తతకు దారితీశాయి. వైసీపీ నేతలు, అధికారుల తీరుపై తెలుగు తమ్ముళ్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. గుంటూరు తూర్పు నియోజకవర్గ పరిధిలోని పాత బస్టాండ్ సెంటర్‌లోని డివైడర్‌పై టీడీపీ నేత పెమ్మసాని చంద్ర శేఖర్ ఫ్లెక్సీలను వేశారు. వాటిపై ఎమ్మెల్యే ఎండీ ముస్తఫా, తన కుమార్తె నియురాలు సమన్వయకర్త నూరి ఫాతిమా ఫ్లెక్సీలను వైసీపీ నాయకులు వేశారు. దీనిని గమనించిన టీడీపీ శ్రేణులు శుక్రవారం ఉదయం వైసీపీ ఫ్లెక్సీలను తొలగించారు. దీంతో ఆ ప్రాంతంలోని వైసీపీ నాయకులు అక్కడకు వచ్చి టీడీపీ వర్గీయులతో గొడవకు దిగారు. అంతేగాక డివైడర్‌పై ఉన్న పెమ్మసాని ఫ్లెక్సీలను చించేశారు. దీంతో ఇరువర్గాల మధ్య వివాదం నెలకొంది. విషయం తెలిసి తూర్పు ఇన్‌చార్జి ఎండీ నసీర్ అహ్మద్ సహా పలువురు నాయకులు అక్కడకు వచ్చారు. యాడ్ సంస్థలకు నగదు చెల్లించి పెమ్మసాని ఫ్లెక్సీలు వేసుకుంటే వాటిపైనే ముస్తఫా, నూరిఫాతిమా ఫ్లెక్సీలు వేయడం ఏమిటని నసీర్ అహ్మద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ శ్రేణులను పోలీసులు అడ్డుకోగా అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొన్నది. అనంతరం పోలీసుల సూచనతో టీడీపీ నాయకులు నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు.

ఓటమి భయంతో నీచరాజకీయాలు : నసీర్

ఓటమి భయంతో ఎమ్మెల్యే ముస్తఫా నీచ రాజకీయాలకు దిగుతున్నారని నసీర్ అహ్మద్ తెలిపారు. పెమ్మసాని అధికారికంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేసుకుంటే అనధికారికంగా వైసీపీ ఫ్లెక్సీలు రాత్రికిరాత్రి ఎలా వేస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ నేతలు నీచ రాజకీయాలు మానుకోవాలని హెచ్చరించారు. అనధికారికంగా ఏర్పాటు చేసిన వైసీపీ ఫ్లెక్సీలను తొలగించాలని నగరపాలక సంస్థ అధికారులకు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ యల్లావుల అశోక్, నాయకులు వేములకొండ శ్రీనివాస్, కొనకళ్ల సత్యం, రబ్బాని, వేల్పూరి కిరణ్, సూరే శ్రీనివాస్, అన్వర్, వెంకటేశ్వర్లు, రఫి, ఖాదర్, రబ్బాని, హుస్సేన్ తదితరులున్నారు.

మంగళగిరిలో అధికారుల దురుసు

మంగళగిరిలోని ఈద్గా ఫంక్షన్ హాలులో శుక్రవారం సాయంత్రం ముస్లీం మైనార్టీలు సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సదస్సుకు సంబంధించి కొద్ది గంటల ముందు గౌతమబుద్ధ రోడ్డు డివైడర్‌పై ఫ్లెక్సీలను ఏర్పాటు చేస్తున్న సమయంలో ఎంటీఎంసీ సిబ్బంది వాటిని తొలగించారు. దీనిపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ టీడీపీ గుంటూరు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, టీడీపీ, జనసేన శ్రేణులు సిబ్బందిని అడ్డుకుని గౌతమబుద్ధ రోడ్డుపై ధర్నాకు దిగారు. ఫ్లెక్సీలకు అనుమతి లేదని మైనార్టీ నేతలతో టీపీవో రమేష్, డీసీపీ అశోక్‌లు దురుసుగా ప్రవర్తించారు. దీంతో మైనార్టీ నేతలకు, అధికారులకు తీవ్రస్థాయిలో వాగ్వాదం, తోపులాట చోటుచేసుకుంది. దీనిని వీడియో తీస్తున్న టౌన్‌ప్లానింగ్ ఉద్యోగి బుర్రముక్క అవినాష్‌రెడ్డిని మైనార్టీ నేతలు అడ్డుకుని నిలదీశారు. అనంతరం అతడ్ని పట్టణ పోలీసు స్టేషన్‌కు తీసుకువెళ్లి తమను కులం పేరుతో దూషించారని ఫిర్యాదు చేశారు. మైనార్టీలపై అధికారుల తీరును టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త నందం అబద్ధయ్య ఖండించారు. ఫ్లెక్సీలను చించివేసి భయభ్రాంతులకు గురిచేయడం దుర్మార్గమన్నారు. వైసీపీ బస్సుయాత్ర సమయంలో దుకాణాలను మూయించి సభలు నిర్వహించినప్పుడు అధికారులు ఎక్కడున్నారని ప్రశ్నించారు. పోతినేని మాట్లాడుతూ కార్పొరేషన్ అధికారులు పక్షపాత వైఖరిని అవలంబిస్తున్నారని ధ్వజమెత్తారు. విధి నిర్వహణ చేతకాకపోతే రాజీనామా చేసి వైసీపీ కండువాలు కప్పుకోవాలని ఎద్దేవా చేశారు. ముస్లీం మైనార్టీలను దూషించిన ఎంటీఎంసీ సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీడీపీ మైనార్టీ సెల్ నేతలు మహమ్మద్ ఇబ్రహీం, షేక్ రియాజ్, అబ్దుల్ మజీద్, జనసేన నేత షేక్ సుభానీ, అబ్దుల్లా ఖాన్, నజీర్, షేక్ సుభానీ, హుస్సేన్, టీడీపీ నేతలు పడవల మహేష్, విన్నకోట శ్రీనివాసరావు, రంగిశెట్టి బాబీ, గోవాడ దుర్గారావు, తోట సాంబశివరావు, వేమూరి మైనర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



మంగళగిరి పోలీసుస్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న టీడీపీ, మైనార్టీ నేతలు



మంగళగిరి గౌతమబుద్ధ రోడ్డుపై ధర్నా చేస్తున్న ముస్లీం మైనార్టీ నేతలు

వాళ్లకో రూల్.. వీళ్లకో రూల్

ఫ్లెక్సీలతో పాటు పార్టీ కార్యక్రమాలకు అనుమతుల విషయంలో అధికారుల తీరు సర్వత్రా విమర్శలకు దారితీస్తోంది. ప్రతిపక్ష పార్టీల ఫ్లెక్సీలు, బ్యానర్లు, సభలు, సమావేశాలకు అభ్యంతరం చెప్పే అధికారులు అధికార పార్టీ విషయంలో మాత్రం నిబంధనలకు నీళ్లొదులుతున్నారనే ఆరోపణలున్నాయి. అధికారుల తీరుపై ప్రతిపక్ష పార్టీలతోపాటు సామాన్య ప్రజలు సైతం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏదైనా సభలు, సమావేశాలప్పుడు ఆయా రాజకీయ పార్టీలు ఫ్లెక్సీలు, స్వాగత ద్వారాలు ఒక్కరోజు ముందుగా ఏర్పాటు చేసుకోవడం పరిపాటి. అనుమతి లేని పక్షంలో అధికారులు అందరికీ ఒక్కటే రూల్ అమలు చేయాలి. కానీ జిల్లాలోని పలు ప్రాంతాల్లో అందుకు భిన్నంగా కేవలం అధికార వైసీపీకి చెందిన ఫ్లెక్సీలు, కార్యక్రమాలకు ఉత్సాహంగా అనుమతి ఇస్తూ.. నిబంధనల పేరిట మిగతా పార్టీలకు అనుమతి నిరాకరిస్తున్నారు. టీడీపీ, జనసేన పార్టీలు ఏర్పాటుచేసిన ఫ్లెక్సీలను అనేకమార్లు తొలగించారు. మంగళగిరితో పాటు వివిధ ప్రాంతాల్లో యువగళం పాదయాత్ర సమయంలోనూ అధికారులు ఇబ్బందులకు గురిచేశారు. అధికారుల తీరుతో విసుగు చెందిన ప్రతిపక్షాలు సభలు, సమావేశాలకు కొద్దిగంటల ముందు మాత్రమే ఫ్లెక్సీలను ఏర్పాటు చేసుకుంటున్నారు. దానికి కూడా అధికారులు అనుమతులు నిరాకరిస్తూ వాటిని ఆ వెంటనే తొలగిస్తున్నారు. అధికార వైసీపీ విషయంలో మాత్రం ఈ నిబంధనలకు తిలోదకాలిస్తున్నారు. అధికార పార్టీ విషయంలో పూర్తి సహాయ సహకారాలను అందిస్తున్న అధికారులు.. ప్రతిపక్ష పార్టీలపై ఉక్కుపాదం మోపడంపై ఆయా పార్టీలు నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



గత నెల 31న మంగళగిరి మెయిన్ బజారులో దుకాణాలను మూసివేయించి మరీ ఏర్పాటుచేసిన వైసీపీ జెండాలు



వెంకటపాలెం రైతు ధర్నా శిబిరంలో నినాదాలు చేస్తున్న మహిళలు

రాజధాని అమరావతిపై వైసీపీ కుట్ర

● 1,528వ రోజుకు చేరుకున్న రైతుల ఆందోళనలు

తుళ్ళూరు, ఫిబ్రవరి 23: రాష్ట్రానికి సంపదనిచ్చే రాజధాని అమరావతిని వైసీపీ ప్రభుత్వం మూడుముక్కల ఆటతో సర్వనాశనం చేసిందని 33వేల ఎకరాలను త్యాగం చేసిన రైతులు అన్నారు. అమరావతిని భ్రమరావతి అని ప్రపంచానికి తప్పుడు ప్రచారం చేశారన్నారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు, రైతుకూలీలు, మహిళలు చేస్తున్న ఆందోళనలు శుక్రవారం నాటికి 1528వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా పలువురు రైతులు రాజధాని రైతు ధర్నా శిబిరాల నుంచి మాట్లాడుతూ రాజధాని అమరావతిని, రాష్ట్ర ప్రజల జీవనాడి అయిన పోలవరాన్ని జగన్‌రెడ్డి విస్మరించాడన్నారు. ఆంధ్రప్రదేశ్‌ని 20 ఏళ్ల వెనకబాటుకు గురిచేశారన్నారు. ఇప్పటికైనా సీఎం జగన్‌రెడ్డి భైర్లు కమ్మిన కళ్లను తెరవాలన్నారు. రాజధానిని నాశనం చేయటం వెనక కుట్ర దాగి ఉందన్నారు. రైతులు చేస్తున్న ఉద్యమాన్ని అవమాన పరిచారన్నారు. హైకోర్టు తీర్పును అమలు చేయాలని డిమాండ్ చేశారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. దీపాలు వెలిగించి బిల్డ్ అమరావతి, జై ఆంధ్రప్రదేశ్ అంటూ నినాదాలు చేశారు. తుళ్లూరు, వెంకటపాలెం, వెలగపూడి, మందడం, నెక్కల్లు, అనంతవరం తదితర రాజధాని గ్రామాల్లో రైతుల ఆందోళనలు కొనసాగాయి.

ఉత్సాహంగా ఎడ్ల బలప్రదర్శన



సీనియర్స్ విభాగంలో ప్రథమస్థానంలో నిలిచిన ఎడ్లజత

మాచవరం, ఫిబ్రవరి 23: మాచవరం మండలం మోర్జంపాడు గ్రామంలో వేంచేసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి 68వ కల్యాణ మహోత్సవాన్ని పురస్కరించుకొని నాలుగు రోజులుగా ఎడ్ల బలప్రదర్శన పోటీలు ఉత్సాహంగా నిర్వహిస్తున్నారు. శుక్రవారం నిర్వహించిన సీనియర్స్ విభాగంలో మొత్తం ఐదు జతలు పాల్గొనగా గుంటూరు జిల్లా తాడేపల్లి గ్రామానికి చెందిన లంకిరెడ్డి నిక్షిత్‌రెడ్డి, కృష్ణాజిల్లా ఘంటసాల గ్రామానికి చెందిన మేకా కృష్ణమోహన్ కంబైన్డ్ ఎడ్లజత ప్రథమస్థానంలో నిలిచాయి. తెలంగాణ రాష్ట్రం సూర్యాపేట జిల్లా హుజుర్‌నగర్ గ్రామానికి చెందిన సుంకి సురేందర్‌రెడ్డి, హైదరాబాద్‌కు చెందిన డి.రోహన్‌బాబు కంబైన్డ్ ఎడ్ల జత ద్వితీయ, కృష్ణాజిల్లా ఘంటసాల గ్రామానికి చెందిన మేకా కృష్ణమోహన్ ఎడ్లు మూడవ స్థానంలో నిలిచాయి. గుంటూరు జిల్లా లింగాయపాలెం గ్రామానికి చెందిన యల్లం సాంబశివరావు ఎడ్లు నాల్గవ, పొన్నూరు మండలం సీతారామపురం గ్రామానికి చెందిన దాసరి నారాయణరావు ఎడ్లు ఐదవ స్థానంలో నిలిచాయి.



PLOT FOR SALE

➡ AP రాజధాని పూలింగ్‌కి 3km దూరంలో గుంటూరు - అమరావతి రోడ్ దగ్గరలో లాండ్ కన్వర్షన్, బ్యాంక్ లోన్, బోరు నీరు, గేట్, ఫెన్సింగ్, గజం 7000 to 8500/-, సంప్ర: 7730099126, 99594 19044.
AAA-8249

FLAT FOR SALE

➡ గుంటూరు, A.T. అగ్రహారం 5/2 సాహితీ అపార్ట్‌మెంట్ (2008) నందు గ్రౌండ్ ఫ్లోర్ - G2, 1050 చదరపు అడుగుల ఫ్లాట్, కారు పార్కింగ్ ఉన్నది అమ్మబడును. 30 లక్షలు, సంప్ర: 9885 789 117, 9989 5929 58.
AJG-184751

➡ ఫుల్లీ ఫర్నిషిడ్ 3 BHK ఫ్లాట్ గుంటూరు పట్టణంలో శ్యామలనగర్ 8వ లైనులో గల "సాయి రత్న హైట్స్" నందు (నెం.302) కార్ పార్కింగ్, పూర్తి ఫర్నిచర్ వర్క్స్ అన్ని సదుపాయాలతో (Ready to Occupy) అమ్మకమునకు కలదు. డైరెక్ట్ పార్టీ వారికి ప్రాధాన్యం సెల్: 9848238210
AJD-177354

SHARES

➡ షేర్ మార్కెట్ & మ్యూచువల్ ఫండ్స్ (బేసిక్స్, ఫండమెంటల్స్ & టెక్నికల్) ట్రైనింగ్ కోర్సు (రెగ్యులర్ / సండే బ్యాచ్) ఫ్యాకల్టీ బై NSE సర్టిఫైడ్ మార్కెట్ ప్రొఫెషనల్, GNT, Cont: 98851 35323.
RK-1349

మ్యారేజ్ బ్యూరో

➡ నాయుడు వరుడుకి వధువు కావలెను. వైశ్య వధువులకు వరులు కావలెను, రజక వధువుకి (35Y), వరుడు కావలెను. HIV వరుడుకి వధువు కావలెను. సంప్ర: 7569184096, వాట్సాప్: 7382975074. 10 AM TO 5 PM కాల్ చేయగలరు.
AJG-151933

గోల్డ్ ఫైనాన్స్

➡ బంగారం బ్యాంకులలో ఇతర సంస్థలలో ఉన్నవి. ఈ రోజు ఆన్‌లైన్ ధరకు కొనబడును స్పాట్ క్యాష్, (100% జెన్యూన్) సంప్ర. సెల్ : 945 945 3338
AJB-181880

బంగారం కొనబడును

➡ బంగారము బ్యాంకులలో, ఇతర సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) 100% జెన్యూన్ సంప్ర : 88024 89999
AJB-181885

ఆంధ్రజ్యోతిలో క్లాసిఫైడ్ ప్రకటనల కొరకు
ఈ క్రింది నెంబరును సంప్రదించగలరు
99854 03281
సమయం :
ఉ॥ 10:00 గం॥ల నుండి
సా॥ 06:00 గం॥ల వరకు
(సోమవారం నుండి శనివారం వరకు)

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

సదా మీ సేవలో



అచిరకాలంలోనే అశేష ప్రజాదరణ చూరగొన్న ఆంధ్రజ్యోతి కి చందాదారులుగా చేరాలనుకుంటున్నారా!

ఈ ఫోన్ నెంబర్లకు ఫోన్ చేసి చెబితే చాలు మా సిబ్బంది తక్షణం మీకు పత్రిక అందే ఏర్పాటు చేస్తారు. అంతేకాదు, పత్రిక పంపిణీలో మీరు ఏమైనా అసౌకర్యం ఎదుర్కొంటున్నా, ఏదైనా నిర్మాణాత్మకమైన సూచన చేసి చెప్పదల్చినా, మా సిబ్బంది సదా మీ సేవకు సిద్ధంగా ఉంటారు

గుంటూరు 1 టౌన్	97036 18725
గుంటూరు 2 టౌన్	99854 01056
తెనాలి	99854 11202
నరసరావుపేట	99854 11206
బాపట్ల	99663 35084
పిడుగురాళ్ల	93909 05725
మంగళగిరి	93986 73618
అమరావతి	95027 86195
పొన్నూరు	97042 99094
రేపల్లె	99854 12254
చిలకలూరిపేట	99639 84109
వినుకొండ	99662 50266
మాచర్ల	88861 19952
సత్తెనపల్లి	91103 23914
ప్రత్తిపాడు	63004 34285

సర్క్యులేషన్ మేనేజర్ 99854 11214

ఇట్లు: బ్రాంచ్ మేనేజర్

రేపు మంగళగిరి ఎయిమ్స్ జాతికి అంకితం

● వర్చువల్‌గా చేయనున్న ప్రధాని నరేంద్ర మోదీ
● 9 క్రిటికల్ కేర్ బ్లాకులకు శంకుస్థాపన
● విశాఖలో మైక్రోబయాలజీ ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్
● ఏపీలో 4 మొబైల్ ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్‌లు

మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 23: కేంద్ర ప్రభుత్వం మంగళగిరిలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించిన అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ (ఎయిమ్స్)ను ప్రధాని నరేంద్ర మోదీ ఆదివారం జాతికి అంకితం చేయనున్నారు. వర్చువల్ విధానంలో ఆయన ఎయిమ్స్‌ను జాతికి అంకితం చేయడంతోపాటు 9 క్రిటికల్ కేర్ బ్లాకులకు శంకుస్థాపన, విశాఖపట్నంలో మైక్రోబయాలజీ ఫుడ్ టెస్టింగ్ ల్యాబొరేటరీ, ఏపీలో మొత్తం నాలుగు మొబైల్ ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్‌లను ప్రారంభించనున్నారు. మంగళగిరి ఎయిమ్స్ ఆసుపత్రిలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎయిమ్స్ డైరెక్టర్ అండ్ సీఈవో డాక్టర్ మధుబానందకర్ వివరాలను వెల్లడించారు. 25న జరిగే కార్యక్రమానికి రాష్ట్ర గవర్నరు ఎస్.అబ్దుల్ నజీర్, కేంద్ర మంత్రులు డాక్టర్ మన్సూఖ్ మాండవ్య, ప్రహ్లాద జోషి, డాక్టర్ భారతీ ప్రవీణ్ పవార్, ఎస్పీ సింగ్ బఘేల్, ఏపీ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని హాజరుకానున్నారని చెప్పారు.



2015, డిసెంబరు 19న 183.11 ఎకరాల విస్తీర్ణంలో రూ.1618.23 కోట్ల వ్యయంతో మంగళగిరి ఎయిమ్స్‌కు ఆనాటి కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి జేపీ నడ్డా శంకుస్థాపన చేశారని తెలిపారు. ఎయిమ్స్‌లో వైద్య కళాశాల, మెడికల్ ల్యాబ్, నర్సింగ్ కళాశాల, ఓపీడీ, ఇన్‌పేషెంట్, అత్యవసర సేవలు, రెసిడెన్షియల్ బ్లాక్, గెస్ట్ హౌస్, లైబ్రరీ, అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్, ధర్మశాల బిల్డింగ్, ఆయుష్, ఆడిటోరియం, ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణం పూర్తిచేసుకుని అందుబాటులోకి వచ్చాయన్నారు. 2019, మార్చి 12 నుంచి అవుట్ పేషెంట్ విభాగం పనిచేస్తుండగా, ప్రస్తుతం ఓపీడీలో ప్రతిరోజు రోగుల సగటు 2,500గా వుందన్నారు. ఈ నెల 20వ తేదీ నాటికి 15 లక్షల ఓపీ సేవలు అందించినట్టు చెప్పారు. ఇప్పటివరకు 20 వేల మందికి పైగా ఇన్‌పేషెంట్ అడ్మిషన్లు, మరో 12 వేల మంది అత్యవసర సేవలు పొందినట్టు తెలిపారు. ఎంబీబీఎస్ కోర్సులో 2018లో ప్రారంభించగా, ప్రస్తుతం 600 మంది ఎంబీబీఎస్ విద్యార్థులు చదువుకుంటున్నారని స్పష్టం చేశారు. మరో వంద మంది విద్యార్థులు వివిధ విభాగాల్లో పీజీ కోర్సులను అభ్యసిస్తున్నారని వెల్లడించారు. ఈ విద్యా సంవత్సరం నుంచి పారామెడికల్ కోర్సులను కూడా ప్రారంభించాలని యోచిస్తున్నట్టు చెప్పారు. సమావేశంలో ఎయిమ్స్ డిప్యూటీ డైరెక్టర్ (అడ్మిషన్స్) శశికాంత్ తుమ్మా, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ వినీత్ థామస్ అబ్రహం, అధికార ప్రతినిధి డాక్టర్ కే.వంశీకృష్ణ పాల్గొన్నారు.

స్పైసెస్ వ్యాపార రంగంలోకి సంగం డెయిరీ

● ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ ● మార్కెట్‌లోకి కారం, పసుపు, మషాలాల విడుదల



సంగం డెయిరీ నూతన ఉత్పత్తులను మార్కెట్‌లోకి ప్రవేశపెడ్తున్న సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ తదితరులు

చేబ్రోలు, ఫిబ్రవరి23: వినియోగదారుల అవసరాలకు అనుగుణంగాఆ సంగం డెయిరీ స్పైసెస్ వ్యాపారం రంగంలోకి అడుగుపెట్టినట్లు డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ తెలిపారు. వడ్లమూడి సంగం డెయిరీలో శుక్రవారం సంగం ఉత్పత్తులను నరేంద్రకుమార్ మార్కెట్‌లోకి ప్రవేశపెట్టారు, సంగం స్పైసీ చిల్లీ పౌడర్, పసుపు పొడి, చికెన్ మసాల, సాంబార్ పౌడర్, గరం మసాలను వివిధ ప్యాకింగ్‌లలో మార్కెట్‌లోకి ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో నరేంద్ర కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో 5,796 గ్రామాల్లో లక్షన్నర మంది పాడిరైతులతో సంగం డెయిరీ విస్తరించినట్లు చెప్పారు. రోజుకు 7.80 లక్షల లీటర్ల పాల సేకరణ చేస్తున్నామన్నారు. గుంటూరు జిల్లా అంటే కారంకు ప్రసిద్ధి అన్నారు. దుగ్గిరాల పసుపుకు పేరు కాంచిందన్నారు. గుంటూరు జిల్లాలో రైతులు పండించే ప్రతి పంటను సంగం ద్వారా మార్కెట్‌లోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. స్థానికంగా ఉన్న ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను సంగంతో భాగస్వామ్యం చేసుకొని వ్యవసాయ ఉత్పత్తులను సంగం కో ప్యాకింగ్ ద్వారా మార్కెట్‌లోకి ప్రవేశపెడుతున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో ఉన్న 8 వేల మందికి పైగా డిస్ట్రిబ్యూటర్లు, ఏజెంట్ల ద్వారా 92 రకాల పాలు, పాల పదార్థాలు, ఇతర ఆహార ఉత్పత్తులు, 174 పరిమాణాల్లో వినియోగదారుల గృహాలకు చేరవేస్తున్నామని అన్నారు. మసాల దినుసులను పుష్పా ఆగ్రోటెక్ సంస్థతో ఒప్పందం చేసుకొని సంగం కో ప్యాకింగ్‌లో మార్కెట్‌లోకి ప్రవేశపెట్టినట్లు చెప్పారు. నాణ్యతతో రాజీపడకుండా అత్యంత నాణ్యమైన ఉత్పత్తులను వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా అందచేస్తున్నట్లు వివరించారు. సంగం డెయిరీ ఉత్పత్తులను ప్రజలు ఆదరించాలన్ని విజ్ఞప్తి చేశారు. అలాగే వెన్న, నెయ్యిలో కల్తీలను పరీక్షించే హైపెర్ఫామెన్స్ లిక్విడ్ క్రోమోటోగ్రఫీ అధునాత యంత్రాలను విదేశాల నుంచి తెప్పించి నాణ్యతా పరీక్షలు ప్రారంభించిన్నట్లు చెప్పారు. నూతన పరీక్షల ల్యాబ్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎండీ పి.గోపాళ్ళ కృష్ణన్ తదితరులు పాల్గొన్నారు.

కోటప్పకొండ అభివృద్ధి, రోడ్ల నిర్మాణంపై అలసత్వం

● మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, ఫిబ్రవరి23: ప్రముఖ శైవక్షేత్రం కోటప్పకొండ అభివృద్ధి, అక్కడి రహదారి నిర్మాణం ప్రభుత్వానికి కనీసం గుర్తున్నాయా? అని మాజీమంత్రి ప్రత్తిపాటి పుల్లారావు ప్రశ్నించారు. కోటప్పకొండ తిరునాళ్ళకు సమయం దగ్గర పడుతున్నప్పటికీ పనులు నత్తనడకన సాగటం, రోడ్ల మరమ్మత్తులైతే ప్రారంభం కాకపోవటంపై విచారం వ్యక్తం చేశారు. త్రికోటేశ్వర స్వామి దేవాలయం రాష్ట్రంలోనే అత్యంత పురాతన ప్రసిద్ద దేవాలయాల్లో ఒకటి అని, ఈ కోటప్పకొండ జాతరకు లక్షలాది మంది భక్తులు వస్తారని, అలాంటి చోట అభివృద్ధి, మౌలిక వసతులు ఎందుకు ఇంత అలసత్వం చేస్తున్నారో అర్థం కావటం లేదన్నారు. కోటప్పకొండకు చేరుకోవటానికి నరసరావుపేట నుంచి రెండు, చిలకలూరిపేట ఒక దారి ఉన్నప్పటికీ అవేవి ప్రస్తుతం సరిగా లేవన్నారు. నియోజక వర్గంలోని పలు గ్రామాల నుంచి ప్రభలు వస్తుంటాయని, కాని దారులన్నీ అధ్వాన్నంగా ఉన్నాయన్నారు. ఆ దారుల్లో ప్రభలు ఎలా తీసుకు రావాలని? ప్రజలు పడుతున్న ఆందోళన గుర్తించి ఇకనైనా యుద్ధప్రాత్రిపదికన రోడ్ల మరమ్మత్తులు పూర్తి చేయాలన్నారు.

సీఎం సభకు బస్సులు రయ్.. రయ్..

● మళ్ళీ ప్రయాణికులకు కష్టాలు ● ప్రైవేటు వాహనాలతో జేబులకు చిల్లు



ఎన్‌టీఆర్ బస్టాండ్‌లో ప్రయాణీకుల పడిగాపులు

గుంటూరు, ఫిబ్రవరి 23: సీఎం సభ అంటేనే ఆర్టీసీ ప్రయాణీకులకు ప్రయాణ కష్టాలు తప్పటం లేదు. తప్పనిసరి ప్రయాణాలైతే ప్రైవేటు వాహనాల బాట పట్టి జేబులకు చిల్లు పెట్టుకోవాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి. మొన్నటి కి మొన్న అనంతపురం జిల్లా రాప్తాడులో సీఎం సిద్ధం సభకు బస్సులు తరలించిన ఆర్టీసీ యాజమాన్యం తాజాగా శుక్రవారం ఒంగోలు సభకు తరలించారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని బాపట్ల జిల్లాలోని చీరాల, అద్దంకి, బాపట్ల డిపోల నుంచి 55 బస్సులు, గుంటూరు జిల్లాలోని పొన్నూరు, గుంటూరు -1, 2 డిపోలతో పాటు తెనాలి, మంగళగిరి డిపోల నుంచి 97, పల్నాడు లోని చిలకలూరిపేట, నరసరావుపేట, వినుకొండ, సత్తెనపల్లి డిపోల నుంచి 88 సర్వీసులను సీఎం సభకు తరలించారు. ఒంగోలులో పేదలకు ఇళ్ళ పంపిణీకి సంబంధించి సీఎం సభకు జన సమీకరణకు జిల్లా నుంచి 240 బస్సులను తరలించారు. అలానే నెల్లూరు జోన్ నుంచి 240తో కలిపి ప్రకాశం, నెల్లూరు జిల్లాల నుంచి మొత్తం 500 బస్సులు ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ వర్గాలు తెలిపాయి. సీఎం సభకు బస్సులు గురువారం సాయంత్రమే వెళ్ళిపోవటంతో ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ముఖ్యంగా పల్నాడు ప్రాంతంతో పాటు తెనాలి, విజయవాడ, పర్చూరు, అమరావతి రూట్లలో ప్రయాణీకులు అనేక ఇబ్బందులు పడ్డారు. ఆటోలు, టాటా మ్యాజిక్‌లు, కార్లు వంటి ప్రైవేటు వాహనాలను ఆశ్రయించి అదనపు ఛార్జీలతో గమ్యస్థానాలకు చేరుకోవాల్సి వచ్చింది. ఇక మార్కెట్ సెంటర్‌లోని పల్నాడు బస్టాప్ వద్ద ప్రయాణీకులు బస్సుల కోసం పడిగాపులు కాయాల్సి వచ్చిందని వాపోతున్నారు.

బస్సులన్నీ ముఖ్యమంత్రి సభకు..

బాపట్ల, ఫిబ్రవరి 23: బాపట్ల ఆర్టీసీ డిపో పరిధిలో ఆర్డినరీ బస్సులు 27 ఉండగా అందులో 20 బస్సులు ఒంగోలులో జరిగిన ముఖ్యమంత్రి సభకు శుక్రవారం మళ్లించారు. 7 సర్వీస్‌లే మిగిలి ఉండటం వల్ల అధికారులు అన్ని ప్రాంతాలకు నడపలేకపోయారు. దీనివల్ల ప్రయాణికులు రోడ్ల వెంట పడిగాపులు కాస్తూ నానా ఇబ్బందులు పడ్డారు. ఎక్స్‌ప్రెస్ సర్వీస్‌లు అందుబాటులో ఉండవు. ఆర్డనరీలు ఈ విధంగా ముఖ్యమంత్రి సభలకు తరలించటం ఇబ్బందిగా ఉందని పలువురు ప్రయాణికులు పేర్కొంటున్నారు.

రెండు ఇళ్లలో భారీ చోరీ



వినుకొండ ఎస్‌బీఐ ఏటీఎంలో తస్కరించిన ఏటీఎం కార్డు ద్వారా డబ్బు డ్రాచేస్తున్న అనుమానితులు

వినుకొండటౌన్, ఫిబ్రవరి 23: సినిమా ఫక్కీలో దొంగలు రెక్కీ నిర్వహించి పెద్దమొత్తంలో బంగారం, నగదు దోచుకెళ్లిన ఘటన మండలంలోని పిట్టంబండ, గోనుగుంట్లవారిపాలెం గ్రామాల్లో జరిగింది. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితులు తెలిపిన వివరాలను పరిశీలిస్తే.. పిట్టంబండ గ్రామానికి చెందిన మక్కెన గంగాధర్ నివాసానికి తాళాలు వేసి ఉండగా బుధవారం అర్ధరాత్రి ఇంటికి వేసిన తాళాలను పగలగొట్టి ఇంట్లోని 19 సవర్ల బంగారు, 3కిలోల వెండి, రూ.2 లక్షలు దోచుకున్నారు. వీటితో పాటు దొంగిలించిన ఏటీఎం కార్డుతో రెండు ఏటీఎంలలో రూ80 వేలు డ్రా చేశారు. అదే రోజు రాత్రి గోనుగుంట్లవారిపాలెంలో దండు శ్రీనివాసరావు నివాసంలో 14 సవర్ల బంగారం, రూ.30 వేలు నగదు అపహరించారు. క్లూస్ టీమ్ గురువారం ఘటనా స్థలాల్లో వేలిముద్రలను సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ సాంబశివరావు తెలిపారు.

చేతబడి నెపంతోనే వ్యక్తి హత్య



దుండగులు తగలబెట్టిన మోటార్ బైక్‌ను పరిశీలిస్తున్న పోలీసులు

ఈపూరు, ఫిబ్రవరి23: చేతబడి చేస్తున్నాడనే అనుమానంతో గుర్తుతెలియని వ్యక్తులు తులసీ నాయక్(47)ను హత్య చేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. అగ్నిగుండాల సమీపంలో గురువారం తులసీనాయక్ హత్య జరిగిన విషయం విదితమే. సంఘటనా స్థలాన్ని నర్సరావుపేట డీఎస్పీ వీఎస్ఎన్ వర్మ, వినుకొండ సీఐ సాంబశివరావు సందర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. గుంటూరు నుంచి క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ వచ్చి పరిసర ప్రాంతాలను పరిశీలించారు. బొల్లాపల్లి మండలం మాలపాడుకు చెందిన భూక్యా తులసీ నాయక్ గ్రామంలో పూజలు చేస్తూ ఆరోగ్యం బాగాలేని వారికి తాయిత్తులు వేస్తుంటాడు. గ్రామంలోని పొలాల్లో బోరులో నీరు రాకపోవడంతో ఈపూరు మండలం అగ్నిగుండాల సమీపంలో పొలం కౌలుకు తీసుకొని సాగు చేస్తున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు. తులసీనాయక్ బంధువు ఒకరు అనారోగ్యంతో మృతి చెందగా చేతబడి చేయడం వలనే చనిపోయాడని అనుమానం వ్యక్తం చేసినట్లు చెబుతున్నారు. తులసీ నాయక్‌ను హత్యచేసి అతని కుడిచేతి బొటన వేలు కోసుకొని వెళ్లారు. అంతేకాకుండా అతని మోటార్ బైక్‌ను తగలబెట్టారు. బొటనవ్రేలు కోసుకొని పోవడం చూస్తే ఇది కచ్చితంగా చేతబడి చేసినాడనే అనుమానంతో హత్యచేశారని అనుమానిస్తున్నారు. తులసీనాయక్ భార్య మాత్రం తన భర్తకు అమ్మవారు పూనకం వస్తుందని, అందువలన ఇంట్లో పూజలు చేస్తామని పోలీసులకు చెప్పింది. తులసీ నాయక్ మృతదేహానికి వినుకొండ ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం చేసి బంధువులకు అప్పగించినట్లు ఎస్ఐ ఎస్కే మహమ్మద్ ఫిరోజ్ తెలిపారు.

విద్వేషాలు రెచ్చగొడుతున్న కిలారి



● ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్

పొన్నూరుటౌన్, ఫిబ్రవరి22: కులమతాల పేరుతో విద్వేషాలను రెచ్చగొట్టాలని ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య ప్రయత్నిస్తున్నారన్ని మాజీ ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ ఆరోపించారు. శుక్రవారం జరిగిన సమావేశంలో నరేంద్ర కుమార్ మాట్లాడుతూ మామ్మ అల్లుళ్లు ఉమారెడ్డి, కిలారి భాగోతాలను ప్రజల ముందు ఉంచుతామన్నారు. ఉమారెడ్డి వెంకటేశ్వర్లు ఎంపీగా పోటీ చేస్తే ఆయన సొంత నియోజకవర్గం బాపట్లలో మెజార్టీ రాలేదని, పొన్నూరులో వచ్చిన మెజారిటీతోనే ఆయన ఎంపీగా గెలిచారని గుర్తు చేశారు. తాము ఎంపీగా గెలిపిస్తే తనపై తన్న తమ్ముడిపై 20 మంది టీడీపీ కార్యకర్తలపై హత్య కేసు పెట్టించాడనా ఆవేదన వ్యక్తం చేశారు. తాను నోరు తెరిస్తే మామ్మ అళ్లులు నోరుకూడా ఎత్తలేనన్నారు. మామ అల్లుళ్ల చరిత్రే కాదు, ఇప్పుడు ఎంపీ అభ్యర్థిగా ఉన్న ఉమారెడ్డి వెంకట రమణ చరిత్ర కూడా తన దగ్గర ఉందన్నారు. చట్టపరమైన చర్యలు ప్రారంభించి వీళ్ల భాగోతాలను ప్రజల ముందు ఉంచనున్నట్లు నరేంద్ర కుమార్ హెచ్చరించారు. పొన్నూరు టికెట్టు తెచ్చుకుంటే ప్రజాక్షేత్రంలో పోరాడదామన్ని ఎమ్మెల్యే కిలారికి నరేంద్ర కుమార్ సవాలు చేశారు.

జగన్ పాలనలో మైనార్టీలకు తీరని ద్రోహం

● టీడీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మౌలానా షేక్ ముస్తాక్



ప్రసంగిస్తున్న టీడీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మౌలానా షేక్ ముస్తాక్

మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 23: ముస్లి మైనార్టీల సంక్షేమం కోసం కేటాయించిన రూ.వేల కోట్లను జగన్ రెడ్డి ప్రభుత్వం దారిమళ్లించి ముస్లిం, మైనార్టీలకు తీరని ద్రోహం చేసిందని టీడీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మౌలానా షేక్ ముస్తాక్ అన్నారు. మంగళగిరి నియోజకవర్గ ముస్లిం మైనార్టీల ఆత్మీయ సమావేశం పట్టణంలోని ఈద్గా ఫంక్షన్ హాలులో శుక్రవారం జరిగింది. సమావేశానికి టీడీపీ, జనసేన మైనార్టీ శ్రేణులు భారీగా హాజరయ్యారు. తొలుత పట్టణంలో బైకుర్యాలీ నిర్వహించారు. వేదికపై స్వర్గీయ ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించారు. మైనార్టీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు మహమ్మద్ ఇబ్రహీం అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వైసీపీ ప్రభుత్వం వచ్చాక ముస్లిం మైనార్టీలపై జరుగుతున్న దాడులు, దౌర్జన్యాలు, మైనార్టీల సమస్యలపై చర్చించారు. ముస్తాక్ మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వంలోనే మైనార్టీలకు అన్ని విధాలా సంక్షేమ ఫలాలు అందాయన్నారు. దైవ దర్శనానికి హజ్‌యాత్రకు వెళ్లేవారికి హజ్‌హౌస్‌ల నిర్మాణం, సబ్సిడీలు, దుల్హన్ పథకం అందిస్తానని వాగ్దానం చేసిన జగన్‌రెడ్డి హామీలను తుంగలో తొక్కారని విమర్శించారు. రాష్ట్రంలో 80 ముస్లిం మైనార్టీ కుటుంబాలపై దాడులు జరిగితే సీఎం జగన్ నుంచి కనీస స్పందన లేదన్నారు. ఇస్లామిక్ బ్యాంకు ఏర్పాటు చేసి వడ్డీలేని రుణాలను అందిస్తానని చెప్పి మైనార్టీలను దారుణంగా మోసం చేశారని మండిపడ్డారు. మైనార్టీలకు తీరని ద్రోహం చేసిన జగన్ ప్రభుత్వానికి రాబోయే ఎన్నికల్లో ముస్లిం మైనార్టీలంతా ఐక్యంగా బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి మహమ్మద్ నసీర్ అహ్మద్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండీ నజీర్, అధికార ప్రతినిధులు నాగుల్‌మీరా, సయ్యద్ రఫీ, విజయవాడ పశ్చిమ నియోజకవర్గ నేత ఎంఎస్ బేగ్, హెచ్‌ఆర్డీ సభ్యుడు ఎస్పీ సాహెబ్, గుంటూరు పార్లమెంట్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు అబ్దుల్ గని, టీడీపీ మంగళగిరి పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్, మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి అబ్దుల్ మజీద్, పట్టణ అధ్యక్షుడు షేక్ సుభానీ, నజీర్ తదితరులు పాల్గొన్నారు.

లైంగిక వేధింపులకు పాల్పడిన కానిస్టేబుల్ సస్పెన్షన్

దాచేపల్లి, ఫిబ్రవరి 23: వివాహితను లైంగిక వేధింపులకు గురిచేసిన పోలీసు కానిస్టేబుల్‌ను జిల్లా ఉన్నతాధికారులు సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు శుక్రవారం దాచేపల్లి పోలీసులు తెలిపారు. దాచేపల్లి పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న వ్యక్తి తనపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడని తనకు న్యాయం చేయాలని బాధితురాలు జిల్లా ఎస్పీ, గురజాల డీఎస్పీ, దాచేపల్లి సీఐలకు వినతిపత్రం అందజేసింది. బాధితురాలికి అండగా పలు ప్రజాసంఘాలు కూడా న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశాయి. గత ఐదు రోజుల క్రితం అధికారులు కానిస్టేబుల్‌ను వీఆర్‌కు తరలించగా ఈ రోజు సస్పెండ్ చేస్తున్నట్లు ఉత్తర్వులు అందజేశారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.15 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	155, 164,175
చికెన్ విత్ స్కిన్	300.00
చికెన్ స్కిన్ లెస్	310.00

యూనియన్ బ్యాంక్ Union Bank of India **కన్నావారితోట బ్రాంచి- 02421**
96-1-95, మెయిన్ రోడ్డు, నగరంపాలెం, కన్నావారితోట, గుంటూరు. ఫోన్స్: 0863-2234013, 9324502421.
e-Mail: ubin0802425@unionbankofindia.bank

ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టము 54/ 2002 యొక్క సెక్షన్ 13(2) ప్రకారము (SARFAESI ACT) డిమాండ్ నోటీసు

చీఫ్ మేనేజర్, అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కన్నావారితోట బ్రాంచి, గుంటూరు వారి నుండి యాక్ట్ 54 ఆఫ్ 2002 క్రింద
1) ఋణగ్రహీత : శ్రీ తుంగా రాము, తండ్రి : కోటేశ్వరరావు, నివాసము : డి.నెం.92-5-387(యస్), 10వ లైను, శ్రీరాం నగర్, ఎటి అగ్రహారం, గుంటూరు-522004, 2) సహ అభ్యర్థి : శ్రీమతి తుంగా ప్రమీల, భర్త : తుంగా రాము, డి.నెం.92-5-387(యస్), 10వ లైను, శ్రీరాం నగర్, ఎటి అగ్రహారం, గుంటూరు-522004.
అయ్యా / అమ్మా,
విషయం : సెక్షన్ 13(2), సెక్షన్ 13(3)తో చదువుకోవలసిన సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 క్రింద నోటీసు.
ఇందుమూలముగా మీకు తెలియజేయునది ఏమనగా మీలో నెం.1వ చిరునామాదారు మా కన్నావారితోట బ్రాంచి (02421) నుండి క్రింద తెలిపిన ఋణసౌకర్యమును పొంది యున్నారు మరియు బకాయిలు/వాయిదాలు/వడ్డీలు చెల్లించుటలలో, ఖాతాలను సంతృప్తికరంగా నిర్వహించుటలో విఫలమైనందున మీ ఖాతాను 25-01-2024 న నిరర్థక ఆస్తిగా(NPA) వర్గీకరించబడినది. తేది.25-01-2024 నాటికి మీ ఋణ ఖాతాల బకాయి మొత్తము రూ.36,42,949.72 పైగా (అక్షరాల ముప్పైఆరు లక్షల నలభైరెండు వేల తొమ్మిది వందల నలభైతొమ్మిది రూపాయలు మరియు పైసలు డెబ్బైరెండు మాత్రము). బ్యాంకు వారు అనేకమార్లు విన్నపములు చేసినప్పటికీ, మీలో నెం.1వ వారు మీ ఖాతాలోని బకాయి మొత్తములను చెల్లించలేదు.

సౌకర్యము	NPA తేది 25-01-2024 నాటికి బకాయి మొత్తం	వర్తించని వడ్డీ	జరిమానా వడ్డీ (సాధారణ)	బ్యాంక్ చేసే ఖర్చులు & ఛార్జీలు	బకాయి మొత్తం
హెచ్‌యల్‌జియస్ 024230100151116	రూ.18,90,511/-		రూ.0.00	రూ.0.00	రూ.18,90,511/-
ఎటిపీయల్ 024230100151107	రూ.4,18,870.80		రూ.0.00	రూ.0.00	రూ.4,18,870.80
ఎటిఓడి 024231100001042	రూ.13,33,567.92		రూ.0.00	రూ.0.00	రూ.13,33,567.92
బకాయి మొత్తము					రూ.36,42,949.72

బ్యాంక్‌కు చెల్లించవలసిన సొమ్ము లేదా బకాయిలను తిరిగి చెల్లించుటకు శ్రీ తుంగా రాము డి.27-09-2017 & డి.21-11-2017న దస్తావేజులను సమర్పించి సెక్యూరిటీ వడ్డీని సృష్టించి ఉన్నారు.
తనఖావుంచబడిన ఆస్తి యొక్క వివరములు: ఆస్తి నెం.1 : గుంటూరు జిల్లా, నల్లపాడు సబ్ డిస్ట్రిక్ట్, గుంటూరు మునిసిపల్ కార్పొరేషన్ ఏరియా, గుంటూరు సిటీ టౌన్ సర్వేకానటువంటి, ఎ.టి.అగ్రహారం, నల్లపాడు గ్రామము డి.నెం.130/బి లోని ఎ.2.26 సెంట్ల విస్తీర్ణములో ప్లాట్ నెం.23కు చెందిన 287 చ॥గ॥ల విస్తీర్ణములో పడమరవైపునగల 153 చ॥గ॥ల విస్తీర్ణముగల భూమి మరియు అందులోని బిల్డింగ్‌కు సంబంధించిన యావదాస్తి. దీనికి హద్దులు: తూర్పు: ప్లాట్ నెం.22 -60 అ॥, దక్షిణం: 20 అ॥ల వెడల్పుగల రోడ్ -23 అ॥, పడమర: టి. నిరంజన్ కుమార్‌కు చెందిన ఆస్తి -60 అ॥, ఉత్తరం: ప్లాట్ నెం.18 -23 అ॥. అందులోని రెసిడెన్షియల్ బిల్డింగ్(ఇంటి ఆస్తి) గ్రౌండ్ ఫ్లోర్ మరియు 1వ అంతస్తులు ఒక్కొక్కటి 771 [illegible]

[illegible]

SARFAESI [illegible]

స్థలం : గుంటూరు
తేది : 23-02-2024

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ



ఖబరస్థాన్‌లో ఏర్పాట్లు పరిశీలిస్తున్న నసీర్

పెద్దల పండుగకు తరతరాల ప్రాముఖ్యత

● టీడీపీ గుంటూరు తూర్పు ఇన్‌చార్జి మొహమ్మద్ నసీర్

● షబ్ ఏ బారాత్ ఏర్పాట్లు పరిశీలన

గుంటూరు, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): పెద్దల పండగ (షబ్ ఏ బరాత్)కు తరతరాలుగా ఎంతో ప్రాముఖ్యత ఉందని, ఇషా నమాజ్ తర్వాత విధిగా తమ పెద్దలకు దువా (ప్రార్థన) అందించడానికి ఖబరస్థాన్‌కు వేల సంఖ్యలో మైనార్టీలు వస్తారని టీడీపీ గుంటూరు తూర్పు ఇన్‌చార్జి మొహమ్మద్ నసీర్ తెలిపారు. ఈనెల 25న గుంటూరు సంగడిగుంట ఖబరస్థాన్‌లో నిర్వహించే షబ్ ఏ బరాత్ (పెద్దల పండగ) ఏర్పాట్లును మైనారిటీ నాయకులతో కలిసి ఆయన సందర్శించారు. ఏర్పాట్లకు సంబంధించి కార్పొరేషన్ కాంట్రాక్టర్లకు పలు సూచనల అందజేశారు. ఈ సందర్భంగా నసీర్ మాట్లాడుతూ ఖబరస్తాన్‌కు వచ్చే ముస్లిములకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా రాకపోకలకు వీలుగా రోడ్లు, లైట్లు, తాగు నీటి సౌకర్యం ఏర్పాటు చేయాలని కార్పొరేషన్ అధికారులను కోరారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక ఖబరస్థాన్‌ను సుందరంగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పఠాన్ జమీర్, సయ్యద్ అన్వర్, షేక్ రఫీ, షేక్ ఖలీల్, ఖాసిం వలి, షేక్ రబ్బాని, షేక్ ఇర్ఫాన్, ఆదిల్, షేక్ బాషి, బాజీ, తదితరులు పాల్గొన్నారు.

మంత్రి రజిని అధికార దుర్వినియోగం హేయం

● టీడీపీ పశ్చిమ నియోజకవర్గ నేత డాక్టర్ నిమ్మల శేషయ్య



గుంటూరు, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని టీడీపీ పశ్చిమ నియోజకవర్గ నేత డాక్టర్ నిమ్మల శేషయ్య విమర్శించారు. గుజ్జనగుండ్లలోని తన కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఓ యూట్యూబ్ ఛానల్‌లో తన రాజకీయ ఇంటర్వ్యూ కోసం వైద్యులను, వైద్య సిబ్బందిని సమావేశపరిచి మంత్రి రజిని అధికార దుర్వినియోగానికి పాల్ప డిందన్నారు. ప్రజల ప్రాణాలకంటే సొంత రాజకీయ ప్రచారం ముఖ్యమని ఒక మంత్రి భావించడం సిగ్గుచేటన్నారు. వైద్యులను, ఆరోగ్య కార్యకర్తలను ప్రజలుగా నటింపజేస్తూ యూట్యూబ్ ప్రచార చిత్రం చిత్రీకరించడం నీతిలేని చర్య అని అన్నారు. అధికార దుర్వినియోగానికి పాల్పడిన మంత్రి రజినిపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

విద్యార్థులపై కులవివక్ష చూపుతున్న సీఎం

గుంటూరు, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): సాంఘిక సంక్షేమ పాఠశాలలు, రెసిడెన్షియల్ హాస్టళ్ళలోని ఎస్సీ, ఎస్టీ, బలహీనవర్గాల పిల్లలు జగన్ రెడ్డి కుల వివక్షతో నరకయాతన అనుభవిస్తున్నారని టీడీపీ ఎస్సీ సెల్ నేతలు ధ్వజమెత్తారు. పార్టీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగన్ రెడ్డి దుర్మార్గపు పాలనలో ఎస్సీలు 100 ఏళ్ళు వెనకబడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీ దుర్మార్గ పాలనను ఎండగడుతూ దళిత శంఖారావంపేర గుంటూరు జిల్లా ఎస్సీ సెల్ తరపున ఉద్యమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్సీ నేతలు దయారత్నం, మైనర్‌బాబు, భాస్కర్, యాకోబు, హరిదాస్, సుధాకర్, చినబాబు, శ్రీను, పున్నారావు తదితరులు పాల్గొన్నారు

టీడీపీ నేత సైదారావు మృతి



సైదారావు (ఫైల్)

గుంటూరు, ఫిబ్రవరి 23 : టీడీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి కర్నాటి సైదారావు(48) శుక్రవారం కన్నుమూసారు. కిడ్నీ దెబ్బతినడంతో నెల రోజులుగా ఆయన హైదరాబాదులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆయన ఆరోగ్య పరిస్థితి క్షీణించి శుక్రవారం సాయంత్రం ఆయన తుదిశ్వాస విడిచారు. అయన మరణవార్తతో పార్టీ శ్రేణులు తీవ్ర దిగ్ర్భాంతికి గురయ్యారు. శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత స్వగ్రామం కారంపూడి మండలం కాకానివారిపాలెం తరలించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. శనివారం గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించనున్నారు. ఆయన మరణ వార్త విన్న పలువురు టీడీపీ నాయకులు సైదారావు కుటుంబ సభ్యులను ఓదార్చి ఆయన భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కర్నాటి సైదారావు మరణం టీడీపీకి తీరని లోటు

గుంటూరు (ఆంధ్రజ్యోతి): టీడీపీ సీనియర్ నేత కర్నాటి సైదారావు అకాల మరణం పార్టీకి తీరని లోటని పలువురు నేతలు అన్నారు. శుక్రవారం పిచ్చుకలగుంటలోని ఎన్‌టీఆర్ భవన్‌లో సైదారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా టీడీపీ జిల్లా కార్యాలయ కార్యదర్శి కంచర్ల శివరామయ్య మాట్లాడుతూ కర్నాటి సైదారావు మరణం పార్టీకి తీరని లోటన్నారు. కర్నాటి సైదారావు అకాల మరణానికి టీడీపీ జిల్లా అధ్యక్షుడు తెనాలి శ్రావణ్‌కుమార్ సంతాపం తెలిపారు. కార్యక్రమంలో దామచర్ల శ్రీనివాసరావు, నాయుడు ఓంకార్, మేళం సైదయ్య, జాగర్లమూడి శ్రీనివాసరావు, శ్రీనివాసరావు, చిన్న బాజీ, శంకర్, హుస్సేన్,ఫిరోజ్, ఏడుకొండలు పాల్గొన్నారు.

జన్నత్ హుస్సేన్ మృతి.. రెవెన్యూ వర్గాల దిగ్ర్భాంతి

● గుంటూరులో రెండేళ్ల పాటు విధుల నిర్వహణ



జన్నత్ హుస్సేన్ (ఫైల్)

గుంటూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్‌గా ఇంచుమించు రెండేళ్ల పాటు బాధ్యతలు నిర్వహించి కొన్నేళ్ల క్రితమే ఉద్యోగవిరమణ చేసిన జన్నత్ హుస్సేన్ అనారోగ్యంతో కన్నుమూశారన్న సమాచారాన్ని జిల్లా రెవెన్యూవర్గాలు జీర్ణించుకోలేక పోతున్నాయి. అప్పట్లో ఆయన వద్ద పనిచేసిన నేటి విశ్రాంత ఉద్యోగులు నాటి మధురజ్ఞాపకాలను గుర్తు చేసుకొంటూ ఆవేదన వ్యక్తపరుస్తున్నారు. నిజాయితీకి నిలువుటద్దంగా అభివర్ణిస్తున్నారు. అంతేకాక ఎన్నికల సమయంలో నిష్పక్షపాతంగా జన్నత్ హుస్సేన్ నిర్వహించిన విధు లను అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్ గుర్తించి ప్రశంసించారంటే విధి నిర్వహణల్లో ఆయన అంకితభావాన్ని అద్దంపటుతుంది.

నేడు సంతాప దినంగా ప్రకటించాలి ...

జన్నత్ హుస్సేన్ అంత్యక్రియలు శనివారం హైదరాబాద్ పంజాగుట్టలో జరగనున్న దృష్ట్యా శనివారం రాష్ట్ర ప్రభుత్వం సంతాపదినంగా ప్రకటించాలని రెవెన్యూ ఉద్యోగసంఘాల నేతలు విజ్ఞప్తిచేశారు. అలానే ఆయన అంతిమ యాత్రలో పాల్గొనేందుకు ఉద్యోగులు హైదరాబాద్ వెళ్లేందుకు అనుమతించాలన్నారు. అలానే కలెక్టరేట్, డివిజన్, మండల రెవెన్యూ కార్యాలయాల్లోనూ సంతాప కార్యక్రమాలు నిర్వహించాలనికోరారు. కలెక్టరేట్‌లో ఏదైనా భవనం/ బ్లాక్‌కు జన్నత్ హుస్సేన్ పేరు పెట్టాలని సూచించారు.



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపల్ డాక్టర్ విద్యాధర తదితరులు

చిప్స్ జాబ్‌మేళాలో 145 మందికి ఉద్యోగాలు

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 23: స్థానిక చౌడవరంలోని చేబ్రోలు హనుమయ్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మస్యూటికల్ సైన్సెస్‌లో శుక్రవారం ఒమేగా హెల్త్ కేర్ (చెన్నై) ఆధ్వర్యంలో బీ.ఫార్మసీ, ఫార్మాడీ విద్యార్థులకు ఇంటర్వ్యూలు క్యాంపస్ ఇంటర్వ్యూలకు మొత్తం 235 విద్యార్థులు హాజరు కాగా, అందులో 145 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికకాగా, వారిలో 80 మంది చిప్స్ కళాశాలకు చెంది విద్యార్థులు ఉన్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సూర్యదేవర విద్యాధర పేర్కొన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన వారికి వార్షిక వేతనం రూ.2.5 లక్షలు ఉంటుందని ట్రైనింగ్‌ప్లేస్మెంట్ అధికారి తెలిపారు. విద్యార్థినీ విద్యార్థులకు కళాశాల అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, సెక్రటరీ డాక్టర్ సి.ఎస్ శ్రీనివాస్, ట్రెజరర్ రాయపాటి గోపాలకృష్ణ తదితరులు అభినందించారు.

సజావుగా ఓటరు క్లెయిమ్‌ల పరిష్కారం

● రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ ముఖేష్ కుమార్ మీనాకు కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి నివేదన



సీఈవో నిర్వహించిన వీసీలో మాట్లాడుతున్న కలెక్టర్, హాజరైన అధికారులు

గుంటూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలను పాటిస్తూ జిల్లాలో ఓటరు క్లెయిమ్‌లను సక్రమంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ ముఖేష్ కుమార్ మీనాకు తెలిపారు. శుక్రవారం రాష్ట్ర సచివాలయం నుంచి సీఈవో మీనా ఎన్నికల నిర్వహణ సన్నద్ధత ఏర్పాట్లు, ఓటరు దరఖాస్తుల పరిష్కారం, భద్రత అంశాలపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ వీసీ సమావేశ మందిరం నుంచి కలెక్టర్ ఎం వేణుగోపాల్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి పెద్ది రోజాతో కలిసి పాల్గొన్నారు.

ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫారం-6,7,8లకు సంబంధించి ఓటరు జాబితా తుది ప్రచురణ నాటికి పెండింగ్‌లో వున్న 22,206 దరఖాస్తులు, ప్రచురణ అనంతరం అందిన 47,247 దరఖాస్తులతో కలిపి మొత్తం 69,453 పరిష్కరించాల్సి వుందన్నారు వీటిలో పరిష్కరించాల్సిన దరఖాస్తులు నేటి వరకు 23,965 వున్నాయని , వాటన్నింటిని క్షేత్రస్థాయిలో సక్రమంగా విచారించి ఈఆర్‌ఓలు నిరంతరం పర్యవేక్షిస్తున్నామన్నారు. జిల్లాలో వున్న పోలింగ్ కేంద్రాల్లో అన్ని మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేశామన్నారు. పోలింగ్ పర్సన్స్‌కు సంబంధించి ఉద్యోగుల వివరాలను ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం డేటాబేస్‌లో నమోదు చేయడం జరిగిందన్నారు. ఎస్ఈబీ, పోలీస్ శాఖల సమన్వయంతో చెక్ పోస్టులను ఏర్పాటు చేసి అక్రమ డబ్బు, మద్యం, మత్తుపదార్థాల రవాన అరికట్టడానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఎన్నికల అంశాలకు సంబంధించి వివిధ పత్రికలలో వచ్చిన వ్యతిరేక వార్తలకు సమాధానాలు ఇవ్వడం జరిగిందన్నారు. రాజకీయపార్టీల ప్రతినిధులు తెలియజేసిన ఫిర్యాదులను పరిష్కరించడం జరిగిందని రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ ముఖేష్ కుమార్ మీనాకు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వివరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఈఆర్‌వోలు, కలక్టరేట్ కో-ఆర్డినేషన్ సెక్షన్ సూపరింటెండెంట్ శిరీష, పోలీసు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

గ్రూపు-2 పరీక్షలకు పకడ్బందీగా చర్యలు

● కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి .. ఏర్పాట్లపై అధికారుతో సమీక్ష

గుంటూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 56 కేంద్రాల్లో జరగనున్న గ్రూపు-2 పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని శంకరన్ కాన్ఫరెన్స్ హాల్‌లో పరీక్షల నిర్వహణపై ఆయన సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 25వ తేదీ ఉదయం 10.30 నుండి మధ్యాహ్నం 1గంట వరకు జరుగుతాయన్నారు. అభ్యర్థులు పరీక్ష కేంద్రానికి ఉదయం 9.30 నుంచి 10 గంటల లోపు చేరుకోవాలని స్పష్టంచేశారు. గ్రేస్ పీరియడ్‌తో కలిపి ఉదయం 10.15 గంటల వరకు మాత్రమే అనుమతి ఉందన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు, సెల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ గాడ్జేట్లు, పుస్తకాలు పూర్తిగా నిషిద్ధమన్నారు. అభ్యర్థులు పరీక్ష సమయం పూర్తి అయ్యే వరకు అనగా, మధ్యాహ్నం 1 గ.వరకు పరీక్ష హాల్‌లోనే వుండాలన్నారు. ఆంధ్ర ప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ వారు జారీ చేసిన సూచనలను పాటించి ఎలాంటి పొరపాట్లు లేకుండా పరీక్షలు సాఫీగా నిర్వహించాలన్నారు. పరీక్ష హాల్‌లో తప్పని సరిగా లైటింగ్ మరియు ఫ్యాన్లు ఉండేటట్లు చూడాలన్నారు. విద్యుచ్ఛక్తి అంతరాయం లేకుండా నిరంతర సరఫరా జరిగేటట్లు ట్రాన్స్ కో అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్ష హాల్ వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. పరీక్షలు రాసే అభ్యర్థులు పరీక్ష ముగిసే వరకు మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష హాల్ లోనే వుండాల్సి వుందని తెలిపారు. పరీక్ష కేంద్రాలవద్ద 144 సెక్షన్‌ను అమలు పరిచేలా సంబంధిత తహసీల్దార్లు ఉత్తర్వులు జారీ చేయాలన్నారు. పరీక్షల నిర్వహణకు నియమించిన అధికారులు పరీక్షల నిర్వహణలో అన్ని జాగ్రత్త చర్యలు తీసుకోవాలని, కలెక్టర్ ఆదేశించారు. అభ్యర్థుల సౌకర్యార్థం కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూము ఫోన్ నెం. 08632234014 ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.

గ్రూప్ - 2 రాత పరీక్షకు పటిష్ట బందోబస్తు : ఎస్పీ తుషార్ డూడీ

గుంటూరు : జిల్లాలో ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) వారి ఆధ్వర్యంలో ఈ నెల 25న జరిగే గ్రూప్ 2 రాత పరీక్షకు పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎస్పీ తుషార్ డూడి తెలిపారు. అభ్యర్థులు హాల్ టికెట్‌లో సూచించే నియమ నిబంధనలు పాటించాలని కోరారు. ఎలక్ట్రానిక్ గాడ్జెట్‌లు పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించబోమన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద జిరాక్స్, ఇంటర్నెట్ షాపులు మూసి వేయాలన్నారు. పరీక్షలు జరిగే చుట్టు పక్కల ప్రాంతాల్లో 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు.



శిశువుకు ట్యాగ్ అమరుస్తున్న కిరణ్‌కుమార్

ఇకపై శిశువుల భద్రతకు ఢోకా లేదు

● జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వై కిరణ్‌కుమార్

గుంటూరు (మెడికల్) ఫిబ్రవరి 23: ప్రభుత్వ సమగ్రాస్పత్రిలో ఇకపై శిశువుల భద్రతకు ఢోకాలేదని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వై కిరణ్‌కుమార్ తెలిపారు. శిశువుల అపహరణను నిరోధించేందుకు కాన్పుల వార్డు దగ్గర ఏర్పాటు చేసిన రేడియో ఫ్రీక్వెన్సీ ఐడెంటిఫికేషన్ (ఆర్‌ఎఫ్‌ఐడీ) సిస్టమ్ కంట్రోల్ రూమ్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వాస్పత్రిలో శిశువులు అపహరణ సంఘటనలు నిరోధించేందుకు గట్టి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఇప్పటికే ప్రసూతి వార్డు దగ్గర నిఘా కెమెరాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఆర్‌ఎఫ్‌ఐడీ విధానంలో పుట్టిన శిశువులకు, వారి తల్లులకు ట్యాగ్ వేసి వారు ఇద్దరూ వేరు కాకుండా ఉండేలా మానిటరింగ్ చేస్తుంటారని తెలిపారు. ఈ ట్యాగ్‌లను ఎవరైనా తొలగించేందుకు ప్రయత్నిస్తే అలారం మోగి సిబ్బందిని అప్రమత్తం చేస్తుందన్నారు. జీజీహెచ్‌లో ప్రస్తుతం 40 రీడర్లు, అలారాలను అమర్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఎఎస్ ఆర్‌ఎంవో సతీష్‌కుమార్, గైనకాలజీ హెచ్‌వోడీ డాక్టర్ వి అరుణ, డాక్టర్ పి జయంతి, నర్సింగ్ సూపరింటెండెంట్ ఆశా సజని పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

గుంటూరు, ఫిబ్రవరి 23 : స్థానిక పొన్నూరు రోడ్డులో ముస్లిమ్ కళాశాల దాటిన తరువాత జరిగిన రోడ్డు ప్రమాదంలో షేక్ మహబూబ్ హుస్సేన్ (25) అనే యువకుడు మృతి చెందాడు. ఈస్ట్ ట్రాఫిక్ సీఐ కోటేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం మధ్యాహ్నం ద్విచక్రవాహనంపై ముగ్గురు వ్యక్తులు బీఆర్ స్టేడియం వైపు నుంచి పొన్నూరు రోడ్డులోని హుస్సేన్ నగర్ వైపుకు వెళుతున్నారు. ఈ క్రమంలో ఎం కన్వెన్షన్ ఎదురుగా రోడ్డు దాటేందుకు డివైడర్ యు టర్న్ తీసుకునేందుకు ఆగి ఉండగా ఆ సమయంలో అతని వెనుకగా వస్తున్న ఎలక్ట్రికల్ బైకు వ్యక్తి అతివేగంగా వచ్చి ఢీ కొట్టాడు. ద్విచక్ర వాహనంపై వెనక కూర్చున్న మహబూబ్ హుస్సేన్ కిందపడగా తలకు బలమైన గాయమైంది. మహబూబ్ హుస్సేన్‌ను ఆసుపత్రికి తీసుకువెళుతుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. ఎలక్ట్రికల్ బైక్ నడుపుతున్న పొత్తూరువారితోట 1వ లైనుకు చెందిన షేక్ ముజిమల్‌కి కూడా తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అయనను ప్రైవేటు హాస్పిటల్‌కి తరలించారు. మృతుని తండ్రి ఫిర్యాదు మేరకు ఈస్ట్ ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు మహ్మద్ హుస్సేన్ బీటెక్ పూర్తి చేశాడు.

అన్నదాతలపై పోలీసుల దాడి హేయం

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి23: ఢిల్లీ సరిహద్దులలో అన్నదాతలపై పోలీసుల దాడి అప్రజాస్వామికమని సీ పీ ఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు అన్నారు. పోలీసు కాల్పులలో మరణించిన యువ రైతు శుభ్‌కరణ్‌సింగ్ హత్యకు నిరసనగా కేంద్ర కార్మిక, సంయుక్త కిసాన్ మోర్చా సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక శంకర్‌విలాస్ సెంటర్లో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శుభకరణ్ సింగ్ ది ముమ్మాటికి ప్రభుత్వహత్యేనని, మృతి చెందిన రైతు కుటుంబానికి రూ.కోటీ పరిహారం ఇవ్వాలని, హోం మంత్రి అమిత్‌షా, హర్యానా సీఎం కట్టర్‌పై కేసులు నమోదు చేయాలన్నారు.

శనగ రైతులు సీఎం యాప్‌లో

పేర్లు నమోదు చేయించుకోవాలి

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 23 : జిల్లాలోని శనగ రైతులు పంటను అమ్ముకోవాటానికి వీలుగా వారి పేర్లు సీఎం యాప్‌లో నమోదుచేయించుకోవాలని జాయింట్ కలెక్టర్ రాజకుమారి గణియా శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఏడాది శనగ పంటకు మార్క్‌ఫెడ్ తరపున క్వింటాల్‌కు రూ.5440 మద్దతు ధర నిర్ణయించామన్నారు. ఈ క్రాప్‌లో పంట వివరాలు పొందుపరచిన రైతులు ఈ నెల 28వ తేదీ నుంచి రైతు భరోసా కేంద్రాలు వద్ద పేర్లు నమోదు చేయించుకోవాలని జేసీ రాజకుమారి విజ్ఞప్తి సూచించారు.

డయేరియా నిర్మూలనకు చర్యలు తీసుకోవాలి

● జీఎంసీ ఎదుట సీపీఎం నేతల ఆందోళన

గుంటూరు(కార్పొరేషన్), ఫిబ్రవరి 23 : నగరంలో డయేరియా సమస్య పునరావృతం కాకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని సీపీఎం నేతలు సూచించారు. ఈ మేరకు శుక్రవారం పార్టీ జెండాలు పట్టుకొని కార్పొరేషన్ మెయిన్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డయేరియా ప్రబలిన ప్రాంతాల్లో జీఎంసీ అధికారులు తాత్కాలిక నివారణ చర్యలు మాత్రమే చేపడుతున్నారని, పూర్తిగా డయేరియా నిర్మూలనకు తగిన చేపట్టాలని డిమాండ్ చేశారు. అనంతరం జీఎంసీ ఉన్నతాధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎంనేతలు నళినీకాంత్ నిక్లస్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

గుంటూరు, ఫిబ్రవరి 23: విద్యుత్ లైన్ల నిర్వహణలో భాగంగా శనివారం వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు గుంటూరు టౌన్-1 ఈఈ టీ.శ్రీనివాసబాబు ఒక ప్రకటనలో తెలిపారు. బ్రాడీపేటలో 1వ లైను నుంచి 13వ అడ్డరోడ్డు వరకు ఉదయం 7.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. అలానేగోరంట్ల, మల్లికార్జునపురం, వెంకటేశ్వర కాలనీ, భాష్యం, టైటానిక్ ఏరియా పరిధిలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నారు. ప్రజలు గమనించి సహకరించాలని కోరారు.

సంత్‌గాడ్గే బాబాకు భారతరత్న ప్రకటించాలి

గుంటూరు, ఫిబ్రవరి 23: మహారాష్ట్రలో శతాబ్దికాలం కిందటే సమసమాజ స్థాపనతో పాటు సంఘసంస్కర్తగా పనిచేసిన నిస్వార్థపరుడు సంత్‌గాడ్గే బాబాకు కేంద్ర ప్రభుత్వం భారతరత్న ప్రకటించాలని ఆంధ్రప్రదేశ్ రజక జన సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జూపూడి శ్రీనివాసరావు కోరారు. గాడ్గేబాబా 148 జయంతి కార్యక్రమం కాకుమానువారితోటలోని ఎస్టీ కాలనీ స్కూల్ సెంటర్‌లో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బహుజన మహాసభ సెంట్రల్ కమిటీ కార్యదర్శి జీఆర్ భగత్‌సింగ్ మాట్లాడుతూ సంత్‌గాడ్గే బాబా సమానత్వం కోసం చేసిన కృషి అనిర్వచనీయమైనదన్నారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు ఖాజావలి, సాంబశివరావు, వట్టికూటి సాంబయ్య, సత్యనారాయణ, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలి

● కార్పొరేటర్ చంద్రగిరి కరుణకుమారి

గుంటూరు, ఫిబ్రవరి 23: అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం చేయకుండా త్వరితగతిన పూర్తి చేయాలని 25వ డివిజన్ కార్పొరేటర్ చంద్రగిరి కరుణకుమారి నగరపాలకసంస్థ అధికారులకు సూచించారు. ఇందులో భాగంగా శుక్రవారం ఆమె డివిజన్ పరిధిలోని గాయత్రీనగర్, మహాత్మా గాంధీ నగర్ ఏరియాలో జరుగుతున్న సీసీ రోడ్లు, డ్రెయినేజీ పనులు పరిశీలించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. కాలనీల్లో అసంపూర్తిగా పనులుంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. స్థానికుల నుంచి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జీఎంసీ సిబ్బంది, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

నిరంకుశ పాలనపై 'ప్రజాపోరు'

● బీజేపీ తూర్పు నియోజకవర్గ కన్వీనర్ శనక్కాయల ఉమాశంకర్

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి23: జగన్ నిరంకుశ పాలనపై బీజేపీ చేపట్టిన ప్రజాపోరులో ప్రతి ఒక్కరూ భాగ్యసాములు కావాలని బీజేపీ గుంటూరు తూర్పు నియోజకవర్గ కన్వీనర్ డాక్టర్ శనక్కాయల ఉమా శంకర్ పిలుపు నిచ్చారు. బీజేపీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న ప్రజాపోరు కార్యక్రమాన్ని శుక్రవారం తూర్పు నియోజకవర్గంలో జిల్లా అధ్యక్షులు వనమా నరేంద్రతో కలసి ఆయన ప్రారంభించారు. అనంతరం ఉమాశంకర్ మాట్లాడుతూ ప్రజాపోరుతో ప్రధాని మోదీ తీసుకువచ్చిన సంక్షేమపథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాల న్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే బీజేపీతోనే సాధ్యమవుతుందన్నారు. వనమా నరేంద్ర మాట్లాడుతూ ఒకవైపు దేశం కోసం మోదీ కష్టపడుతుంటే మరోవైపు రాష్ట్ర సీఎం మాత్రం ప్రజలకి కనపడకుండా పరదాల కట్టుకొని తిరుగుతున్నాడని ఎద్దేవా చేశారు. గాల్లో తిరుగుతూ గాలిమాటలు చెబుతూ గాలి బటన్ నొక్కుకుంటు న్నారని విమర్శించారు. ఇప్పటికైన ఓట్లు అమ్ముకోకుండా నిజాయితీగల వ్యక్తుల్ని అధికారంలోకి తీసుకురావాలని ప్రజలకి విజ్ఞప్తి చేశారు. కార్య క్రమంలో బీజేపీ నాయకులు చరక కుమార్‌గౌడ్, పోతురాజు వెంకటే శ్వర్లు, కామేపల్లి వెంకటేశ్వర్లు, సురేష్ జైన్, బాబురావు, మనోజ్, కాకర్ల వీరేంద్ర కుమార్ పాల్గొన్నారు.



ప్రజాపోరులో పాల్గొన్న ఉమాశంకర్, వనమా నరేంద్ర తదితరులు

గుంటూరు సిటీ: రేషన్ బియ్యం, పక్కాగృహాలు, రోడ్లు, ఆర్బీకేలు, ఆరోగ్య కేంద్రాలు, ప్రాజెక్టులు కేంద్రప్రభుత్వ నిధులతో నిర్మిస్తూ ఉంటే తాము చేయించినట్లు వైసీపీ ప్రభుత్వం డప్పు కొట్టుకుంటుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్రకుమార్ ఆరోపించారు. శుక్రవారం బీజేపీ గుంటూరు 5వడివిజన్ అధ్యక్షుడు మాదాల సురేష్‌యాదవ్ ఆధ్వర్యంలో చుట్టుగుంట సెంటర్ వద్ద ప్రజాపోరు కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ నేతలు వనమా నరేంద్రకుమార్ జూపూడి రంగరాజు పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు మకుటం శివ, పీ. రవికుమార్ తదితరులు పాల్గొన్నారు

ఆంధ్రజ్యోతి
దినపత్రికలో అన్ని రకముల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
సంప్రదించండి 99854 11213 99854 11225 99854 01877 99854 04047 99854 01614



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌ఎం గుంటూరు ఎం రామకృష్ణ

రూ.221.41 కోట్లతో అమృత్‌స్టేషన్ల అభివృద్ధి

● రూ.36.28 కోట్లతో ఆర్‌యూబీల ఏర్పాటు

● ఈ నెల 26న వీడియో లింకు ద్వారా పీఎం మోదీ శంకుస్థాపన

● గుంటూరు డీఆర్‌ఎం రామకృష్ణ

గుంటూరు, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): అమృత్ భారత్ స్టేషన్ స్కీం (ఏబీఎస్ఎస్) కింద గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలో 13 రైల్వేస్టేషన్ల రూపురేఖ లను మార్చబోతున్నట్లు డీఆర్‌ఎం ఎం.రామకృష్ణ తెలిపారు. పలు స్టేషన్లలో పనులు ప్రారంభమయ్యాయని, ఈనెల 26వ తేదీన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వీడియో లింకు ద్వారా ఆయా పనులకు శంకుస్థాపన చేస్తారని చెప్పారు. శుక్రవారం పట్టాభిపురంలోని రైల్‌వికాస్ భవన్‌లో విలేకరుల సమావేశంలో డీఆర్‌ఎం మాట్లాడారు. గుంటూరు, మంగళగిరి, నంద్యాల, గిద్దలూరు, కంభం, మార్కాపురం, నరసరావుపేట, వినుకొండ, సత్తెనపల్లి, నడికుడి, మాచర్ల, మిర్యాల గూడ, నల్గొండ రైల్వేస్టేషన్లను అమృత్‌స్టేషన్లుగా ప్రకటించడం జరిగిందన్నారు. వీటిని సిటీ సెంటర్లుగా అభివృద్ధి చేస్తామని, నగరం/పట్టణానికి ఇరువైపులా యాక్సెస్ కలిగివుంటాయన్నారు. పలుస్టేషన్లలోకి బస్సులు కూడా వచ్చి ప్రయాణీకులు దించి వెళ్లేలా సర్క్యులేటింగ్ ఏరియాలను అభివృద్ధి చేస్తున్నట్లు పేర్కొన్నారు. రైళ్ల, ప్రయాణీకుల భద్రతలో భాగంగా 10 ఎల్‌సీ గేట్లను తొలగించి వాటి స్థానంలో ఆర్‌యూబీల నిర్మాణం చేపట్టబోతున్నామన్నారు. కురిచేడు, వినుకొండ టౌన్, మునుమాక, వేములూరిపాడు, కొప్పురావూరు, కంతేరు, దాచేపల్లి, నార్కెడ్‌పల్లి, బుదారం, కేసరాజుపల్లి గేట్లను తొలగించి ఆర్‌యూబీలను రూ.36.28 కోట్లతో నిర్మాణం చేపట్టబోతున్నామన్నారు. సమావేశంలో ఏడీఆర్‌ఎంలు ఆర్.శ్రీనివాస్, కె. సైమన్, డీసీఎం(కో-ఆర్డినేషన్) డాక్టర్ సీహెచ్ ప్రదీప్‌కుమార్ పాల్గొన్నారు.



హాజరైన విద్యార్థులు, మాట్లాడుతున్న డాక్టర్ రవి గుజ్జుల

నైపుణ్యాభివృద్ధిలో పురోగతి సాధించాలి

● ఏపీఎస్ఎస్ డీసీ జీఎం డాక్టర్ రవి గుజ్జుల

గుంటూరు(విద్య),ఫిబ్రవరి 23: పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాభివృద్ధిలో పురోగతి సాధించినప్పుడే ఉద్యోగ అవకాశాలు సులభతరమవుతాయని, స్కిల్ డెవలప్‌మెంట్ జీఎం డాక్టర్ రవి గుజ్జుల అన్నారు. శుక్రవారం చౌడవరంలోని ఆర్వీఆర్‌జేసీ కళాశాలలో వికసిత భారత్ అంశంపై నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. అగ్రదేశాలకు దీటుగా భారతదేశాన్ని ఉంచే లక్ష్యంతో రూపొందించిన 'వికసిత్ భారత్ విజన్ సాధనలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా విద్యార్థుల నైపుణ్యాన్ని పెంచేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. కృత్రిమ మేధా (ఏ ఐ) టెక్నాలజీని విద్యార్థులు అందుకోవాలని కళాశాలఅధ్యక్షుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ సూచించారు. కార్యక్రమంలో రాయపాటి గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కొండబోలు కృష్ణప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్, అకడమిక్ అండ్ ఆర్ అండ్ డైరెక్టర్ డాక్టర్ కే.రవీంద్ర, కళాశాల డైరెక్టర్ ఫైనాన్స్ అండ్ అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ ఎన్‌వి శ్రీనివాస రావు, సీఎస్‌బీఎస్ విభాగాధిపతి డాక్టర్ ఎంవీపీ చంద్ర శేఖర్, డాక్టర్ స్వర్ణశ్రీ పాల్గొన్నారు.

జర్నలిస్టులపై దాడులకు

ప్రభుత్వమే బాధ్యత వహించాలి

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 23:రాష్ట్రంలో జర్నలిస్టుల పై జరుగుతున్న దాడులకు వైసీపీ ప్రభుత్వ మే బాధ్యత వహించాలని ఏపీడబ్ల్యూజే రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొత్తపల్లి రమేష్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రజల హక్కులకు దిక్కులేకుండా పోయిందని ఆరోపించారు. రాజకీయ పార్టీలు ఎవరు అధికారంలో ఉన్నా కనీస ప్రజాస్వామ్య విలువలు కాపాడాలని ప్రభుత్వాలకు సూచించారు.

మునకరాజశ్రీ ప్రిన్సిపల్ జిల్లాకోర్టు గుంటూరు నందు
O.P.No.156/2024
పిటీషన్:
దొంతిరెడ్డి సునీల్ కుమార్‌రెడ్డి .... పిటీషనరు
మరియు
నిల్ .... రెస్పాండెంట్
పైన పేర్కొన్న O.P.No.156/2024ను మైనర్లు అయినటువంటి దొంతిరెడ్డి డింపుల్ పూజిత దొంతిరెడ్డి మహిధర్ రెడ్డి తరపున గార్డియన్ గా ఉన్నటువంటి తండ్రి అయినటువంటి దొంతిరెడ్డి సునీల్ కుమార్‌రెడ్డి దిగువ షెడ్యూలు ఆస్తి నందు మైనర్లకు కలిగిన 2/3వ వంతు హక్కులు మార్కెట్టు నందు అమ్ముట కొరకు శ్రీ కోర్టువారి పర్మిషన్ ను గార్డియన్ మరియు తండ్రి అయినటువంటి దొంతిరెడ్డి సునీల్ కుమార్‌రెడ్డి ఇప్పించవలసినదిగా కోరుతూ పైన పేర్కొన్న O.P.No. 156/2024 ను దాఖలు చేయడమైనది. కావున సదరు O.P.No. 156/2024 పైన ఎవ్వరికీ అయిన ఎటువంటి అభ్యంతరములు గాని, అభ్యంతరములు వున్నచో శ్రీ కోర్టువారి ముందుకు ది: 20.03.2024 ఉ॥ 10:30 గం॥లకు వ్యక్తి గతముగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరయ్యి తెలువవలసినదిగా యావన్మందికి ఇందుమూలకముగా తెలియజేయడ మైనది. షెడ్యూలు:- గుంటూరు జిల్లా, మంగళగిరి రిజిష్ట్రారు వారి కార్యాలయ పరిధి, గుంటూరు జిల్లా కోర్టు వారి పరిధినందలి, కాజేపల్లి మున్సిపల్ ఏరియాలో చేరిన, కాజేపల్లి సర్వే నెం. 126 మరియు 127 నందలి 15 సెంట్లు లేదా 726 చదరపు గజములు ఖాళీ స్థలము (అనగా సర్వే నెం.126 నందలి 10 సెంట్లు మరియు సర్వేనెం.127 నందలి 5 సెంట్లు) నకు హద్దులు. తూర్పు:దొంతిరెడ్డి శివారెడ్డి ఆస్తి, దక్షిణం: దొంతిరెడ్డి క్రైరామిరెడ్డి ఆస్తి అనగా బి-షెడ్యూలుఆస్తి, పడమర: వలమరాజు గారి ఆస్తి, ఉత్తరం: మాదుగుల కోటిరెడ్డి గారి ఆస్తి (శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)
కె.జోగేశ్వరరావు, అడ్వకేట్
29-1-10, శేషాద్రిశాస్త్రివీధి, గవర్నరుపేట, విజయవాడ-2 సెల్: 9393434471
విజయవాడ తేది: 23.02.2024

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
కన్నావారితోట బ్రాంచి
96-1-95, మెయిన్‌రోడ్, నగరంపాలెం, కన్నావారితోట, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522004. ఫోన్: 9324502421

ఇ-వేలం అమ్మకపు ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8(6) నిబంధనలతో చదవబడు సెక్యూరిటైజేషన్ & రికన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకానికి ఇ-వేలం ప్రకటన.
ఇందుమూలంగా సాధారణ ప్రజానీకానికి ముఖ్యంగా ఋణగ్రహీతలు / సహహామీదారులు / తనఖాదారులు / హామీదారులుకు నోటీసు ద్వారా తెలియజేయునది ఏమనగా ఈ దిగువ పేర్కొనబడిన ఋణగ్రహీతలు / సహహామీదారులు / తనఖాదారులు / హామీదారుల నుండి సెక్యూరిటీ క్రెడిటార్ అనగా పూర్వము ఆంధ్రాబ్యాంక్, ఇప్పుడు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా దిగువ పేర్కొనబడిన బకాయిమొత్తము రాబట్టుకొనుటకు సెక్యూర్డ్ క్రెడిటార్ అయిన పూర్వము ఆంధ్రాబ్యాంక్, ఇప్పుడు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కన్నావారితోట బ్రాంచి యొక్క అధీకృత అధికారిచే స్వాధీనం చేసుకున్న, సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తనఖాపెట్టిన / ఛార్జ్ చేసిన దిగువ వివరించిన స్థిరాస్తులను "ఎక్కడ ఎలా ఉన్నది" "అక్కడ అలా" మరియు "అక్కడ ఏమున్నదో అది" అనే ప్రాతిపదికన ది.14.03.2024న విక్రయించబడును. రిజర్వుధర మరియు బయానా వివరములు దిగువ పేర్కొనబడిన ఆస్తుల దగ్గర పేర్కొనబడినవి.

1 ఋణగ్రహీతలు / తనఖాదారులు / హామీదారులు: (1) మెస్సర్స్ విజయ మారుతి కాటన్స్, యజమాని: శ్రీమతి నెలకుర్తి లక్ష్మి, బృందావన్ ఎన్‌క్లేవ్ అపార్ట్‌మెంట్స్, ఆర్కిడ్ సౌత్ బ్లాక్, ఫ్లాట్ నెం.బి1, సంగడిగుంట, ఏటుకూరు రోడ్డు, గుంటూరు-522003. (2) శ్రీమతి నెలకుర్తి లక్ష్మి, భర్త: యస్.శ్రీనివాసరావు, డోర్ నెం. 19-18-30ఎ/101, సంగడిగుంట, గుంటూరు -522004. (3) శ్రీ నెలకుర్తి శ్రీనివాసరావు, తండ్రి: పేరయ్య, డోర్ నెం. 19-18-30ఎ/101, సంగడిగుంట, గుంటూరు-522004. (హామీదారు). బకాయిసొమ్ము: 03-03-2020 తేదీ నాటికి చెల్లించవలసిన బకాయిమొత్తము రూ.50,79,460.92 (అక్షరాల యాభై లక్షల డెబ్బై తొమ్మిది వేల నాలుగు వందల అరవై రూపాయలు మరియు తొంభై రెండు పైసలు మాత్రమే) + తదుపరి వడ్డీ, వ్యయాలు మరియు ఛార్జీలు.

స్థిరాస్తి యొక్క వివరణ

ఆస్తి-1: గుంటూరు, శారదాకాలనీ, డి.నెం.189/బి7-17-449/4, శ్రీ సాయి విల్లా అపార్ట్‌మెంట్, గ్రౌండ్ ఫ్లోర్‌లో శ్రీమతి నెలకుర్తి లక్ష్మికి చెందిన (30-07-2015 తేదీగల దస్తావేజు నెం.8136/2015) 1150 చ॥అ॥ విస్తీర్ణములోని ఫ్లాట్ నెం.108 ఫ్లాట్ యావత్తు. దీనికి హద్దులు: తూర్పు: ఉమ్మడి వరండా; పడమర : ఉమ్మడి వరండా; ఉత్తరం : గ్రౌండ్ లోని ఓపెన్ ఏరియా; దక్షిణం: గ్రౌండ్ లోని ఓపెన్ ఏరియా. ప్రాజెక్ట్‌కు హద్దులు: తూర్పు: 40అ॥ వెడల్పుగల మునిసిపల్ రోడ్డు; పడమర : మిస్ మేరి ఫాతిమా యొక్క స్థలము ఆస్తి; ఉత్తరం : ఇతరుల యొక్క ఆస్తి; దక్షిణం: 15 అ॥ వెడల్పుగల రోడ్డు.

రిజర్వుధర: రూ.25,11,000/-; బయానా: రూ.2,51,000/-; బిడ్ పెంపుదల: రూ.25,000/-

ఆస్తి-2: గుంటూరు, గుంటూరు మునిసిపల్ కార్పొరేషన్, సంగడిగుంట, ఏటుకూరు రోడ్డు, న్యూ డోర్ నెం.68-168, డి.నెం.19-8-30, బృందావన్ ఎన్‌క్లేవ్ అపార్ట్‌మెంట్, ఆర్కిడ్ సౌత్‌బ్లాక్, గ్రౌండ్ ఫ్లోర్‌లో శ్రీమతి నెలకుర్తి లక్ష్మికి చెందిన (23-11-2006 తేదీగల విక్రయ దస్తావేజు నెం.17512/2006) ఫ్లాట్ నెం.1 రెసిడెన్షియల్ ఫ్లాట్ యావత్తు. దీనికి హద్దులు: తూర్పు: శూన్యాకాశము; పడమర : ఉమ్మడి వరండా; ఉత్తరం : శూన్యాకాశము; దక్షిణం: శూన్యాకాశము. ప్రాజెక్ట్‌కు హద్దులు: తూర్పు: మునిసిపల్ ఓపెన్ డ్రైయిన్; పడమర : మునిసిపల్ కార్పొరేషన్ రోడ్డు; ఉత్తరం : మునిసిపల్ ఓపెన్ డ్రైయిన్; దక్షిణం: BSNL & ఇతరుల ఆస్తి.

రిజర్వుధర: రూ.22,27,000/-; బయానా: రూ.2,23,000/-; బిడ్ పెంపుదల: రూ.22,000/-

ఇ వేలం యొక్క తేదీ మరియు సమయం: 14-03-2024 మ॥ 3.00 గం॥ నుండి సా॥ 5.00 గం॥ల వరకు (ప్రతి 10 నిమిషాల అపరిమిత పొడిగింపులతో)
ఇ-వేలం వెబ్‌సైట్: www.mstcecommerce.com

అమ్మకానికి సంబంధించిన సవివరమైన నియమ నిబంధనల కొరకు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారు అందించిన వెబ్‌సైట్ లింక్ అనగా www.unionbankofindia.co.in / https://www.ibapi.in నందు సందర్శించండి.

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 8(6)/ రూల్ 9(1) క్రింద చట్టబద్ధమైన 15 రోజుల అమ్మకం ప్రకటన
సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 8(6)/ రూల్ 9(1) క్రింద దీనిని నోటీసుగా కూడా పరిగణించబడుతుంది. పైన తెలిపిన ఋణంకు సంబంధించి పైన పేర్కొన్న తేదీలో ఇ-వేలం విక్రయం నిర్వహించబడునని ఋణగ్రహీతలు / హామీదారులకు తెలియజేయడమైనది.

తేది : 23-02-2024
ప్రదేశం : గుంటూరు
సం/- ఛీఫ్ మేనేజర్ & అధీకృత అధికారి
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా



మరోసారి క్వీన్ రాక

కంగనా రనౌత్‌కు కథానాయికగా విశిష్ట గుర్తింపు తెచ్చిన బాలీవుడ్ చిత్రం 'క్వీన్'. పదేళ్ల క్రితం విడుదలైన ఈ చిత్రం అప్పట్లో ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకోవడంతో పాటు విమర్శకుల ప్రశంసలు అందుకుంది. చాలాకాలంగా ప్రేక్షకులు 'క్వీన్'కు సీక్వెల్ చేయాలని కంగనను కోరుతున్నారు. వారి కోరిక త్వరలోనే నెరవేరబోతోంది. 'క్వీన్ 2' చిత్రానికి స్క్రిప్ట్ సిద్ధం చేసినట్లు దర్శకుడు వికాస్ బహల్ తెలిపారు. సీక్వెల్‌లోనూ కంగన రనౌత్ రాణీగా లీడ్ రోల్ లో కనిపించనున్నారు. త్వరలోనే ప్రీ ప్రొడక్షన్ ప్రారంభించి, ఆగస్టు కల్లా సినిమాను సెట్స్‌పైకి తీసుకెళ్తామని వికాస్ తెలిపారు. నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలు త్వరలో వెల్లడించనున్నారు.

దుబాయ్‌లో గామా అవార్డుల వేడుక



తెలుగు చిత్ర పరిశ్రమ గర్వపడేలా మార్చి 3న దుబాయ్‌లో 'గామా' అవార్డుల ప్రదానోత్సవం అట్టహాసంగా నిర్వహించనున్నారు. జ్యూరీ ఛైర్మన్, సంగీత దర్శకుడు కోటి, జ్యూరీ సభ్యులు... నిర్మాత డీవీవీ దానయ్య, దర్శకుడు వీఎన్ ఆదిత్య తదితరులు శుక్రవారం ఈ వేడుకకు సంబంధించిన ట్రోఫీని ఆవిష్కరించారు. పలు విభాగాల్లో తెలుగు చిత్ర పరిశ్రమకు చెందిన వ్యక్తులకు ఈ పురస్కారాలు అందజేస్తామనీ, పలువురు సినీ ప్రముఖులు ఈ కార్యక్రమానికి హాజరవుతారనీ కోటి తెలిపారు. సినీ రంగంలో కొత్త ప్రతిభను ప్రోత్సహించడానికి త్రిమూర్తులు నిర్వహిస్తున్న ఈ వేడుక తెలుగు చిత్ర పరిశ్రమకు గర్వకారణమని డీవీవీ దానయ్య, వీఎన్ ఆదిత్య చెప్పారు.

పిల్లబచ్చాలు మా సినిమాకు రావొద్దు



అనన్య నాగళ్ల ప్రధాన పాత్రలో నటిస్తున్న డిఫరెంట్ హారర్ థ్రిల్లర్ 'తంత్ర'. ధనుష్ రఘుముద్రి కథానాయకుడు. సలోనీ కీలకపాత్రలో నటిస్తున్నారు. శ్రీనివాస్ గోపిశెట్టి దర్శకత్వంలో నరేశ్‌బాబు పి, రవిచైతన్య నిర్మిస్తున్నారు. తమ సినిమాకు 'ఏ' సర్టిఫికెట్ రావడంపై 'తంత్ర' టీమ్ వినూత్నంగా స్పందించింది. 'మా సినిమాకు పిల్లబచ్చాలు రావొద్దు' అని పేర్కొంటూ పోస్టర్ రిలీజ్ చేసింది. హారర్ ఎలిమెంట్స్‌తో తమ సినిమా థ్రిల్ చేస్తుందనీ, త్వరలో ట్రైలర్ విడుదల చేస్తామని చిత్ర బృందం తెలిపింది. ఈ చిత్రానికి సంగీతం: ఆర్ఆర్ ధ్రువన్. సినిమాటోగ్రఫీ: సాయిరామ్ ఉదయ్, విజయ్ భాస్కర్ సద్దాల.

బ్యాడ్‌బాయ్స్ లవ్‌స్టోరీ



వినూత్న ప్రేమ కథా చిత్రం 'వుయ్ లవ్ బ్యాడ్‌బాయ్స్'. రాజు రాజేంద్ర ప్రసాద్ దర్శకత్వంలో పప్పుల కనకదుర్గారావు నిర్మించారు. ఇటీవలే సెన్సార్ పూర్తయిన ఈ చిత్రం టీజర్‌ను దర్శకుడు వశిష్ఠ విడుదల చేసి, యూనిట్‌కు అభినందనలు తెలిపారు. అలీ, సప్తగిరి, భద్రం ప్రధాన తారాగణం. నేటి ట్రెండ్‌కు తగినట్లు కామెడీ ఎంటర్టైనర్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కించామనీ, త్వరలో విడుదల తేదీని ప్రకటిస్తామని నిర్మాత తెలిపారు. రఘు కుంచెతో కలసి భూషణ్ జాన్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: వీకే రామరాజు.

మార్కెట్‌లో మహాలక్ష్మి సందడి



'కేరింత' ఫేం పార్వతీశం కథానాయకుడిగా రూపొందుతున్న చిత్రం 'మార్కెట్ మహాలక్ష్మి'. ప్రణీకాన్వికా కథానాయిక. వీఎస్ ముఖేశ్ యువ దర్శకత్వంలో అఖిలేశ్ కలారు నిర్మించారు. ఈ చిత్రం టీజర్‌ను హీరో శ్రీ విష్ణు ఆవిష్కరించారు. "మార్కెట్ మహాలక్ష్మి' టీజర్‌లో హీరో హీరోయిన్ పాత్రలు ఫన్నీగా అనిపించాయి. పార్వతీశం కామెడీ టైమింగ్ బావుంది. దర్శకుడి ప్రయత్నాన్ని ప్రేక్షకులు ఆదరించాలి' అని కోరారు. అన్నివర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునే అంశాలతో ఈ చిత్రం తెరకెక్కిస్తున్నట్లు దర్శకుడు చెప్పారు. 'ఆకట్టుకునే ప్రేమకథతో పాటు కుటుంబ అనుబంధాలను మనసుకు హత్తుకునేలా తెరకెక్కిస్తున్నాం' అని నిర్మాత తెలిపారు.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/D9npawbలో చదవండి.



దిక్సూచి DIKSUCHI



ఏపీ ఆర్‌సెట్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యామండలి(ఏపీఎస్‌సీహెచ్‌ఈ) తరఫున తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీ(ఎస్‌వీయూ)- రీసెర్చ్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (ఏపీ ఆర్‌సెట్) 2023-24 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఈ ఎగ్జామ్ ద్వారా పార్ట్ టైం/ఫుల్ టైం పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశాలు కల్పిస్తారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న యూనివర్సిటీలు, అనుబంధ కళాశాలలు, రీసెర్చ్ సెంటర్లలో అడ్మిషన్స్ ఇస్తారు.

యూనివర్సిటీలు-సీట్లు

యూనివర్సిటీ	ఫుల్ టైమ్	పార్ట్ టైమ్
ఆచార్య నాగార్జున యూనివర్సిటీ, గుంటూరు	155	76
ఆదికవి నన్నయ యూనివర్సిటీ, రాజమండ్రి	86	36
ఆంధ్ర కేసరి యూనివర్సిటీ, ఒంగోలు	43	37
ఆంధ్ర యూనివర్సిటీ, విశాఖపట్నం	131	70
డా.బీఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ, శ్రీకాకుళం	15	12
ద్రవిడియన్ యూనివర్సిటీ, కుప్పం	33	30
జేఎన్‌టీయూ, అనంతపురం	86	298
జేఎన్‌టీయూ, కాకినాడ	-	426
జేఎన్‌టీయూజీ, విజయనగరం	1	14
కృష్ణ యూనివర్సిటీ, మచిలీపట్నం	33	12
రాయలసీమ యూనివర్సిటీ, కర్నూలు	2	3
ఆర్‌జీయూకేటీ, నూజివీడు	5	7
ఆర్‌జీయూకేటీ, ఆర్‌కే వ్యాలీ	5	5
శ్రీ కృష్ణదేవరాయ యూనివర్సిటీ, అనంతపురం	45	31
శ్రీ పద్మావతి మహిళ విశ్వవిద్యాలయం, తిరుపతి	69	56
శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీ, తిరుపతి	114	95
విక్రం సింహపురి యూనివర్సిటీ, నెల్లూరు	31	14
యోగి వేమన యూనివర్సిటీ, కడప	84	27

స్పెషలైజేషన్‌లు: అడల్ట్ ఎడ్యుకేషన్, ఆంత్రోపాలజీ, బుద్ధిస్ట్ స్టడీస్, కామర్స్, ఎకనామిక్స్, ఎడ్యుకేషన్, ఇంగ్లీష్, ఫైన్‌ఆర్ట్స్, ఫోక్‌లోర్, హిందీ, హిస్టరీ, ఇంటర్నేషనల్ అండ్ ఏరియా స్టడీస్, జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్, లా, లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్, లింగ్విస్టిక్స్, మేనేజ్‌మెంట్, మ్యూజిక్, పర్ఫార్మింగ్ ఆర్ట్స్, ఫిలాసఫీ, ఫిజికల్ ఎడ్యుకేషన్, పొలిటికల్ సైన్స్, సైకాలజీ, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, డా.బీఆర్.అంబేద్కర్ స్టడీస్, రూరల్ డెవలప్‌మెంట్, సోషల్ వర్క్, సోషియాలజీ, సంస్కృతం, తెలుగు, టూరిజం మేనేజ్‌మెంట్, ఉమన్ స్టడీస్, అప్లయిడ్ లైఫ్ సైన్సెస్, బయో కెమిస్ట్రీ, బోటనీ, కెమికల్ సైన్సెస్, కంప్యూటర్ సైన్స్ అండ్ అప్లికేషన్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, జాగ్రఫీ, జియాలజీ, హోం సైన్స్, మెటీరియల్ సైన్స్ అండ్ నానో టెక్నాలజీ, మేథమెటిక్స్, ఫిజిక్స్, సెరికల్చర్, స్టాటిస్టిక్స్, జువాలజీ, సివిల్ ఇంజినీరింగ్, కెమికల్ ఇంజినీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, ఫుడ్ టెక్నాలజీ, మెకానికల్ ఇంజనీరింగ్, మెటలర్జికల్ ఇంజనీరింగ్, మెరైన్ ఇంజనీరింగ్, ఫార్మసీ, బయోటెక్నాలజీ, కంపారటివ్ ద్రవిడియన్ లిటరేచర్, తుళు, మహాత్మా జ్యోతి రావు పూలే స్టడీస్, ఉర్దూ, జియో ఇంజనీరింగ్, మెటియోరాలజీ అండ్ ఫిజికల్ ఓషనోగ్రఫీ.

అర్హత వివరాలు: కనీసం 55 శాతం మార్కులతో సైన్స్, ఆర్ట్స్, మేనేజ్‌మెంట్, కామర్స్, లా, ఫార్మసీ, ఇంజనీరింగ్ విభాగాల్లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి ఉండాలి. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారు కూడా అర్హులే. అనుభవం ఉన్న వారూ దరఖాస్తు చేసుకోవచ్చు.

ఏపీ ఆర్‌సెట్ వివరాలు: ఇది కంప్యూటర్ బేస్డ్ టెస్ట్. అన్నీ మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలే ఇస్తారు. ఇందులో రెండు సెక్షన్లు ఉంటాయి. మొదటి సెక్షన్లో స్పెషలైజేషన్‌కు సంబంధించిన రీసెర్చ్ మెథడాలజీ నుంచి 70 ప్రశ్నలు, రెండో సెక్షన్లో సంబంధిత సబ్జెక్ట్ నుంచి 70 ప్రశ్నలు ఇస్తారు. ప్రశ్నకు ఒక మార్కు ఉంటుంది. నెగెటివ్ మార్కులు లేవు. ఇందులో అర్హత పొందాలంటే జనరల్ అభ్యర్థులకు కనీసం 50 శాతం మార్కులు, రిజర్వ్‌డ్ వర్గాల అభ్యర్థులకు 45 శాతం మార్కులు రావాలి. ఈ టెస్ట్‌లో అర్హత పొందినవారిని మాత్రమే ఇంటర్వ్యూకి పిలుస్తారు. దీనికి 60 మార్కులు నిర్దేశించారు.

- **ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.1500; బీసీ అభ్యర్థులకు రూ.1300; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1000
- **చివరి తేదీ:** మార్చి 19
- **వెబ్‌సైట్:** cets.apsche.ap.gov.in/rcet

బిట్స్ పిలానీ డబ్ల్యుఐఎల్పీ - పీజీ డిప్లొమాలు

ప్రసిద్ధ సాంకేతిక విద్యా సంస్థ - బిట్స్ పిలానీకి చెందిన వర్క్ ఇంటిగ్రేటెడ్ లెర్నింగ్ ప్రోగ్రామ్(డబ్ల్యుఐఎల్పీ) విభాగం మూడు సరికొత్త పీజీ డిప్లొమా ప్రోగ్రామ్‌లను ప్రకటించింది. కెరీర్‌కు ఎలాంటి బ్రేక్ ఇవ్వకుండానే ఈ కోర్సులను చేసే అవకాశాన్ని బిట్స్ కల్పిస్తోంది. మార్చి 18లోపు వీటికి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

- **పీజీ డిప్లొమా ప్రోగ్రామ్ ఇన్ స్మార్ట్ మొబిలిటీ:** స్మార్ట్ మొబిలిటీ కాన్సెప్ట్‌లు, టెక్నాలజీలు, పాలసీలపై సమగ్ర అవగాహన కల్పించే విధంగా ఈ ప్రోగ్రామ్‌ని మలిచారు. మరిన్ని వివరాలకు - https://bits-pilani-wilp.ac.in/pgd/post-graduate-diploma-in-smart-mobility.php
- **పీజీ డిప్లొమా ప్రోగ్రామ్ ఇన్ ఎలక్ట్రికల్ వెహికల్స్:** ఎలక్ట్రిక్ వెహికల్స్ డిజైన్, ఎనర్జీ మేనేజ్‌మెంట్ టెక్నిక్స్, ఈవీ రెగ్యులేషన్స్ తదితరాలను కలుపుతూ ఈ ప్రోగ్రామ్‌ని తీర్చిదిద్దారు మరిన్ని వివరాలకు - https://bits-pilani-wilp.ac.in/pgd/post-graduate-diploma-in-electric-vehicles.php
- **పీజీ డిప్లొమా ప్రోగ్రామ్ ఇన్ ఆటోమోటివ్ సైబర్ సెక్యూరిటీ:** సైబర్ సెక్యూరిటీ సిస్టమ్స్‌పై సంపూర్ణ అవగాహన కలిగించే విధంగా ఈ కోర్సును మలిచారు. https://bits-pilani-wilp.ac.in/pgd/post-graduate-diploma-in-automotive-cybersecurity.php

'దిక్సూచి' వెబ్ పేజీలో.. సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/F6CVv3zలో చదవండి.

జాబ్ కార్నర్

సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో 3000 అప్రెంటిస్‌లు

ముంబయిలోని సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, హ్యూమన్ క్యాపిటల్ మేనేజ్‌మెంట్(రిక్రూట్‌మెంట్ అండ్ ప్రమోషన్ డివిజన్) సెంట్రల్ ఆఫీస్... దేశవ్యాప్తంగా రీజియన్ల వారీగా బ్యాంకు శాఖల్లో అప్రెంటిస్ శిక్షణకు దరఖాస్తులు కోరుతోంది.

ఆంధ్రప్రదేశ్‌లో ఖాళీలు: 100 (గుంటూరు- 40, విజయవాడ-30, విశాఖపట్నం-30)

తెలంగాణలో ఖాళీలు: 90(హైదరాబాద్-58, వరంగల్-38)

శిక్షణ కాలం: ఒక సంవత్సరం

అర్హత: గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి ఏదైనా విభాగంలో గ్రాడ్యుయేట్ డిగ్రీ లేదా తత్సమాన విద్యార్హత కలిగి ఉండాలి.

వయోపరిమితి: 2024 మార్చి 31 నాటికి 20 నుంచి 28 సంవత్సరాల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీలకు అయిదేళ్లు; బీసీలకు మూడేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.

స్టయిపెండ్: నెలకు రూరల్/సెమీ అర్బన్ శాఖలు రూ.15,000. పట్టణ శాఖలు రూ.15,000. మెట్రో శాఖలు రూ.15,000.

ఎంపిక ప్రక్రియ: ఆన్‌లైన్ రాత పరీక్ష, ఇంటర్వ్యూ, మెడికల్ ఫిట్‌నెస్, ధ్రువపత్రాల పరిశీలన, రూల్ ఆఫ్ రిజర్వేషన్ అనుసరించి ఎంపిక చేస్తారు.

రాత పరీక్ష: ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది. 1. క్వాంటిటేటివ్, జనరల్ ఇంగ్లిష్, రీజనింగ్ ఆప్టిట్యూడ్, కంప్యూటర్ నాలెడ్జ్. 2. బేసిక్ రిటైల్ లయబిలిటీ ప్రొడక్ట్స్. 3. బేసిక్ రిటైల్ అసెట్ ప్రొడక్ట్స్ 4. బేసిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రొడక్ట్స్ 5. బేసిక్ ఇన్సూరెన్స్ ప్రొడక్ట్స్ అంశాల్లో ప్రశ్నలు అడుగుతారు.

దరఖాస్తు రుసుము: రూ.800. ఎస్సీ, ఎస్టీ, ఈడబ్ల్యూఎస్/ మహిళా అభ్యర్థులకు రూ.600; దివ్యాంగులకు రూ.400.

ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ: మార్చి 6

ఆన్‌లైన్ పరీక్ష తేదీ: మార్చి 10

వెబ్‌సైట్: www.centralbankofindia.co.in/en

సౌత్ ఈస్టర్న్ కోల్‌ఫీల్డ్స్‌లో 1425 ఖాళీలు

బిలాస్‌పూర్(ఛత్తీస్‌గఢ్)లోని కేంద్ర బొగ్గు గనుల శాఖకు చెందిన సౌత్ ఈస్టర్న్ కోల్‌ఫీల్డ్స్ లిమిటెడ్(ఎస్ఈసీఎల్)... కింద పేర్కొన్న అప్రెంటిస్ ఖాళీల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

విభాగాలు: గ్రాడ్యుయేట్ ఇంజనీర్(మైనింగ్/ఎలక్ట్రికల్/మెకానికల్/సివిల్/ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్ ఇంజనీరింగ్). డిప్లొమా(మైనింగ్/మైనింగ్, మైన్ సర్వేయింగ్/మెకానికల్/సివిల్ ఇంజనీరింగ్)

అర్హత: సంబంధిత ఇంజనీరింగ్ విభాగంలో డిప్లొమా/డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి

ఎంపిక విధానం: విద్యార్హతల్లో సాధించిన మార్కులు, ఉత్తీర్ణత సంవత్సరం, రూల్ ఆఫ్ రిజర్వేషన్ తదితరాల ఆధారంగా

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఫిబ్రవరి 27

వెబ్‌సైట్: www.seclcil.in/index.php

ఎయిర్‌పోర్ట్స్ అథారిటీలో 490 జూనియర్ ఎగ్జిక్యూటివ్‌లు

న్యూఢిల్లీలోని ప్రభుత్వరంగ సంస్థ... ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా... దేశ వ్యాప్తంగా ఉన్న ఏఏఐ కార్యాలయాల్లో కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

1. జూనియర్ ఎగ్జిక్యూటివ్(ఆర్కిటెక్చర్): **3 పోస్టులు**
2. జూనియర్ ఎగ్జిక్యూటివ్ (ఇంజనీరింగ్ - సివిల్): **90 పోస్టులు**
3. జూనియర్ ఎగ్జిక్యూటివ్ (ఇంజనీరింగ్ - ఎలక్ట్రికల్): **106 పోస్టులు**
4. జూనియర్ ఎగ్జిక్యూటివ్ (ఎలక్ట్రానిక్స్): **278 పోస్టులు**
5. జూనియర్ ఎగ్జిక్యూటివ్(ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ): **13 పోస్టులు**

అర్హత: సంబంధిత విభాగంలో బీఈ, బీటెక్/ఎంసీఏ ఉత్తీర్ణతతో పాటు వ్యాలిడ్ గేట్ 2024 స్కోరు ఉండాలి.

దరఖాస్తు రుసుము: రూ.300. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులకు ఫీజు చెల్లింపు నుంచి మినహాయింపు ఉంటుంది.

దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం: ఏప్రిల్ 2 **దరఖాస్తుకు చివరి తేదీ:** మే 1

వెబ్‌సైట్: www.aai.aero/







సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న ముస్లింలు, తదితరులు

ముస్లింలకు పెద్దపీట వేసిన టీడీపీ

● మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్

తెనాలి రూరల్, ఫిబ్రవరి 23: ముస్లింలకు తెలుగుదేశం ప్రభుత్వం పెద్దపీట వేసిందని వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత టీడీపీ అమలు చేసిన పథకాలన్నీ నిలుపుదల చేసి వారి అభివృద్ధిని కుంటుపరిచిందని మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ విమర్శించారు. శుక్రవారం పట్టణంలోని ఎన్వీఆర్ కల్యాణ మండపంలో మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ముస్లింలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ తెలుగుదేశం హయాంలో నారా చంద్రబాబు నాయుడు సీఎంగా రంజాన్ నాడు ప్రభుత్వం తరుపున వారికి గౌరవప్రదంగా రేషన్ షాపుల ద్వారా రంజాన్ తోఫా అందించారన్నారు. ముస్లిం ఆడపిల్లల వివాహాలకు దుల్హన్ ద్వారా ఆర్థికసాయం అందించింది కూడా తెలుగుదేశం పాలనలోనేనని గుర్తుచేశారు. అంతేకాకుండా ముస్లింల పిల్లలు ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దేలా విదేశీ విద్యను కూడా అందించిన ఘనత తెలుగుదేశం పార్టీదేనన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఆ పథకాలను రద్దుచేసిందని ఆరోపించారు. టీడీపీ ముస్లింలకు అన్యాయం చేస్తుందని పలుమార్లు ప్రస్తావిస్తే తప్పనిసరి పరిస్థితుల్లో అడ్డగోలు నిబంధనలతో దుల్హన్ పథకాన్ని పెట్టి దాని లబ్ధి ముస్లిం సోదరులకు అందకుండా దూరం చేసిందన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ ముస్లిందరూ ఆలోచించాలన్నారు. అడుగడుగునా అండగా ఉండే తెలుగుదేశం పార్టీని తిరిగి అధికారంలోకి తీసుకురావాలని చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకున్న తరువాత దుల్హాన్ పథకం తిరిగి అమలు చేస్తామన్నారు. మైనార్టీ పిల్లలకు విదేశీ విద్యాదీవెన పథకం అమలు చేసి ప్రపంచంలో మంచి వర్సిటీలో చదువుకునే అవకాశం కల్పిస్తామని చెప్పారు. ముస్లింలలో పేద కుటుంబాలను అభివృద్ధి పథంలో నడిపించేలా కృషి చేయనున్నట్లు తెలిపారు. వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేనల అభ్యర్థులను గెలిపించి మంచి నాయకత్వానికి స్వాగతం పలకాలని కోరారు. కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ నాయకులు, కార్యకర్తలు, తెలుగుదేశం పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న అన్న క్యాంటీన్‌లు



ఆహారం పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

తెనాలి, మారీసుపేట ఫిబ్రవరి 23: పట్టణంలో మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో పేదప్రజల కోసం నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్‌లు కొనసాగుతున్నాయని టీడీపీ నాయకులు, క్యాంటీన్ నిర్వాహక సభ్యుడు అక్కిశెట్టి వెంకటేశ్వరావు అన్నారు. స్థానిక మార్కెట్ సెంటరులోని అన్న క్యాంటీన్‌లో శుక్రవారం ఎన్నారై విద్యా సంస్థల యాజమాన్యం సహకారంతో పేదలకు అన్నదానం చేశారు. శివాజిచౌక్‌లోని అన్న క్యాంటీన్‌లో ఆలపాటి రాజా దంపతుల సహకారంతో ఆహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్.సాంబశివరావు, కె.రమేష్, గోగినేని రమేష్, గుమ్మడి ప్రసాద్, ఎం.కోటేశ్వరావు, వి.సాంబయ్య, ముళ్ళపూడి వెంకట్, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.



మలేరియా అవగాహన ర్యాలీని ప్రారంభించిన జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ విజయలక్ష్మి, మలేరియా అధికారి మురళీకృష్ణ సుబ్బరాయణం తదితరులు

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచండి

● జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ విజయలక్ష్మి

తెనాలి, మారీసుపేట ఫిబ్రవరి 23: పట్టణంలోని ప్రజలు తమ ఇంటి ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కొర్ర విజయలక్ష్మి పట్టణ ప్రజలను కోరారు. స్థానిక సుల్తానాబాదులో శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ విజయలక్ష్మి, జిల్లా మలేరియా అధికారి తలాటం మురళీకృష్ణ సుబ్బరాయణం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నీటి నిల్వలు దోమల అభివృద్ధికి నిలయాలని, నీటి నిల్వలను వారానికి ఒకసారైనా మార్చుకోవాని సూచించారు. నీటి నిల్వల పాత్రలపై మూతలు పెట్టుకోవాలన్నారు. ఎవరైనా జ్వర పీడితులు ఉండే పట్టణంలోని జిల్లా వైద్యశాలతో పాటు పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో వివిధ రకాల రక్త పరీక్షలను చేసి ఉచితంగా మందులను పంపిణీ చేస్తారని తెలిపారు. మరిన్ని సలహాల కోసం ఆరోగ్య కార్యకర్త లేదా ఆషా కార్యకర్తను సంప్రదించడం ద్వారా తగు ఉచిత వైద్యసాయాన్ని పొందవచ్చునని తెలిపారు. మున్సిపల్ శానిటేషన్ సిబ్బంది నిర్వహిస్తున్న పారిశుధ్య పనులను పరిశీలించి కాలువలోని సిల్ట్‌ను తొలగించాలని పలు సూచనలను చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారిణి డాక్టర్ మహిత, అసిస్టెంటు మలేరియా అధికారి చిరసాని ప్రభాకరరెడ్డి, యూఎల్‌బీ ఆరోగ్య విస్తరణాధికారి అందె చంద్రమౌళి, మలేరియా సబ్ యూనిట్ అధికారి ఉమాకాంత్, సచివాలయం సిబ్బంది, ఆరోగ్య పర్యవేక్షకులు దీపాల శ్రీనివాసరావు, బండారు మల్లేశ్వరావు, దాసరి శివనాగమల్లేశ్వరావు, ఆరోగ్య కార్యకర్తలు రషీద్, బాషిద్, తదితరులు పాల్గొన్నారు.



చలపతి ఉద్గోష్ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న వైవీ ఆంజనేయులు, సుజిత్‌కుమార్

ఉత్సాహంగా 'చలపతి ఉద్గోష్'

తాడికొండ, ఫిబ్రవరి 23: మోతడక చలపతి ఇంజనీరింగ్ కళాశాలలో 'చలపతి ఉద్గోష్-2024' కార్యక్రమం ఉత్సాహంగా నిర్వహించారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి 3000మంది విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొనగా, విచ్చేసిన ఇండియన్ సర్వర్స్ సీఈవో సాయి సతీష్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థిలో విషయ పరిజ్ఞానం, ఆలోచన శక్తి ఇమిడి ఉంటాయని, వాటిని సద్వినియోగం చేసుకొని ముందుకు వెళ్లాలన్నారు. అనంతరం పలాస సినిమా హీరో అట్లూరి రక్షిత్ విద్యార్థులతో కలిసి డ్యాన్స్‌చేసి అలరించారు. శశివదన్ సినిమా, ప్రజ్వల వెబ్ సిరీస్‌కు టీజర్, పాటలు ప్రదర్శించారు. ఉద్గోష్ సందర్భంగా కళాశాలలో క్రీడా, సాంకేతిక, కల్చరల్ పోటీలను నిర్వహించారు. గెలుపొందిన వారికి అకడమిక్ టాపర్స్‌కు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ఛైర్మన్ వై.వీ.ఆంజనేయులు, సెక్రటరీ వై.సుజిత్‌కుమార్, వై.అనంతకుమారి, ప్రిన్సిపాల్ కే.కిరణ్ కుమార్, వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ కే.నాగ శ్రీనివాసరావు, ఉద్గోష్ కన్వీనర్ సాయి శ్రీనివాస్ తదితర అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ తీగల చోరీ

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 23: దొంగలు విద్యుత్ తీగలను చోరీ చేశారు. స్థానిక వైకుంఠపురం సమీపంలోని టిడ్కో కాలనీకి వెళ్లే మార్గంలో ఇటీవల విద్యుత్ లైన్‌వేశారు. ఈ మార్గం కింద చినరావూరు రాకపోకలు సాగించేందుకు అనువుగా ఉంటుంది. ఈ విద్యుత్ లైను వేశాక దానిని అనుసంధానం చేయకపోవడంతో దొంగల పని సులువు అయ్యింది. సుమారు 10 స్థంభాల మధ్య ఉన్న విద్యుత్ తీగలను కత్తిరించుకుపోయారని ఆ ప్రాంత రైతులు చెబుతున్నారు. ఈ ప్రాంతంలోని పొలాలో విద్యుత్ మోటార్ల చోరీ వంటి సంఘటనలు కూడా జరుగుతున్నాయని వాపోతున్నారు. విచ్చలవిడిగా మద్యం బాబులు రాత్రి పగలు తేడా లేకుండా మద్యం సేవిస్తున్నారు. పలుమార్లు కేసులు కూడా నమోదు అయ్యాయి. పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిసింది.

ప్రాణాలుపోతుంటే ప్రభుత్వం ఏం చేస్తోంది..?!

● తక్షణమే మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలి

● జనసేన పీఏసీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్



తెనాలిలో మృతురాలు బండి లక్ష్మి కోడలి నుంచి వివరాలు తెలుసుకుంటున్న మనోహర్

తెనాలి రూరల్, ఫిబ్రవరి 23: కలుషిత నీరుతాగి ప్రజల ప్రాణాలు గాలిలో కలిసిపోతుంటే ఈ ప్రభుత్వం ఏం చేస్తోందని జనసేన పీఏసీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ ప్రశ్నించారు. శుక్రవారం తెనాలి గురువయ్య కాలనీలో కలుషిత నీరుతాగి చికిత్స పొందుతున్న బాధితులను, మృతి చెందిన బండి లక్ష్మి కుటుంబ సభ్యులను మనోహర్ పరామర్శించారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ రక్షిత తాగునీటి పథకాలు ఉన్నా ప్రజలకు సురక్షిత నీరు అందటంలేదంటే నిర్లక్ష్యం ఎక్కడ జరుగుతోందన్నారు. కలుషిత నీటికి బలవుతున్న ప్రజలకు తక్షణ వైద్యసేవలు కూడా అందడంలేదు.. బాధిత ప్రాంతాల్లో అధికారుల సర్వే, మెడికల్ క్యాంపుల వంటివి కూడా లేవు.. ప్రజల ప్రాణాలపై ప్రభుత్వానికి ఎందుకింత నిర్లక్ష్యం అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకు సురక్షిత తాగునీరు అందించాలన్న లక్ష్యంతో రక్షిత తాగునీటి పథకాలను తీసుకువచ్చారన్నారు. వైసీపీ ప్రభుత్వంలో ఆ పథకాలు నిర్వీర్యమయ్యాయన్నారు. అందుకు గత కొంత కాలంగా కలుషిత నీటితో ప్రాణాలు కోల్పోతున్న ఘటనలే అందుకు సాక్షాలుగా నిలుస్తున్నాయన్నారు. గతంలో తెనాలి మండలం కొలకలూరులో మురుగు కాలువలో ఉన్న పైపులైనుకు లీకులు ఏర్పడి వాటి ద్వారా వచ్చిన కలుషిత నీరు తాగి అతిసారం వచ్చిందన్నారు. ఆ సమయంలో ఎంతో భవిష్యత్తు ఉన్న శ్రీనిధి అనే బాలిక మృతిచెందిందన్నారు. బాధిత కుటుంబాలను పరామర్శించగా తమ ప్రాంతంలో మురుగునీరు వస్తున్నా వాటిపై అధికారులు చర్యలు తీసుకోవడంలేదన్నారు. ఈ కారణంతోనే అనారోగ్య సమస్యలు వచ్చాయన్నారు. ఇంత జరిగినా కనీసం అధికారులు పరామర్శించి ఘటనలకు కారణాలపై ఆరా తీసిందే లేదన్నారు. జనసేన తరుపున ఆ కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇవ్వడం జరిగిందన్నారు. తెనాలి ప్రాంతానికి రూ. 100కోట్లతో ఏర్పాటుచేసిన రక్షిత నీటి పథకం నిర్వీర్యం కావడంతోనే నేడు కలుషిత నీటితో ప్రాణాలు కోల్పోయే పరిస్థితి ఉందన్నారు. సకాలంలో లీకులను గుర్తించి సమస్యల పరిష్కరించడంలో ప్రభుత్వం అధికారయంత్రాంగం పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. కలుషితనీరు తాగి అనారోగ్యసమస్యల బారిన పడుతున్న వారు పెరుగుతున్నా ప్రభుత్వం నీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి పెట్టకపోవడం దారుణమన్నారు. తక్షణమే మునిసిపల్ అధికారులు బాధిత కాలనీలో పర్యటించి సర్వే నిర్వహించడంతోపాటు వైద్యక్యాంపులు ఏర్పాటు చేయాలని మనోహర్ డిమాండ్ చేశారు. బాధిత కుటుంబాలకు జనసేన అండగా నిలుస్తుందని హామీ ఇచ్చారు. రానున్న ఎన్నికల్లో జనసేన ప్రభుత్వం ఏర్పడిన వెంటనే సురక్షిత నీరు అందేలా చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బండారు రవికాంత్, హరిదాసు గౌరిశంకర్, పసుపులేటి మురళికృష్ణ, దివ్వెల మధుబాబు, ఎర్రు వెంకయ్య నాయుడు తదితరులు పాల్గొన్నారు.

జన్మభూమి రుణం తీర్చుకునేందుకే..

● టీడీపీ నాయకుడు డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్



నరేంద్ర కుమార్, పెమ్మసాని చంద్రశేఖర్‌లను గజమాలతో సత్కరిస్తున్న ముస్లిం నాయకులు

పొన్నూరు టౌన్, ఫిబ్రవరి 22: జన్మనిచ్చిన గుంటూరు జిల్లా గడ్డ, ఉన్నత శిఖరాలకు చేరుకునేలా ప్రోత్సహించిన ప్రజలకు సేవ చేసేందుకే రాజకీయాల్లోకి అడుగుపెట్టినట్లు గుంటూరు పార్లమెంటరీ స్థాయి నాయకుడు డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. పొన్నూరు నియోజకవర్గ టీడీపీ, జనసేన శ్రేణులకు డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ పరిచయ కార్యక్రమం శుక్రవారం జరిగింది. పొన్నూరు మండలం, చింతలపూడి డీవీసీ కల్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో టీడీపీ శ్రేణులకు నరేంద్ర కుమార్ పెమ్మసాని చంద్రశేఖర్‌ను పరిచయం చేశారు. ఈ సందర్భంగా నరేంద్ర కుమార్ సభలో మాట్లాడుతూ పెమ్మసాని చంద్రశేఖర్ స్వగ్రామం బుర్రిపాలెంలో విద్యాభ్యాసం జరిగిందన్నారు. అయన కుటుంబం మొత్తం తెలుగుదేశం పార్టీ సానుభూతిపరులేనన్నారు. 2009లో రాజశేఖర్‌రెడ్డి పాలన సమయంలో కూడా తెలుగుదేశం పార్టీ తరపున పోటీ చేయటానికి పెమ్మసాని సిద్ధపడ్డారన్నారు. మాచర్ల పరిధిలో వందలాది మంది రైతులకు బోరువేసి సొంత ఖర్చులతో నీళ్లు తెప్పించారన్నారు. రాష్ట్రం విడిపోయిన తర్వాత టీడీపీ అధినేత చంద్రబాబు పాదయాత్ర విజయవంతం చేయటంలో పెమ్మసాని క్రియాశీలక పాత్ర పోషించారన్నారు. వ్యవసాయ ప్రాంతంగా ఉన్న పొన్నూరులో యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు పెమ్మసాని చంద్రశేఖర్ ప్రధాన భూమికి పోషించాలని నరేంద్ర కుమార్ విజ్ఞప్తి చేశారు. అనంతరం డాక్టర్ పెమ్మసాని మాట్లాడుతూ ప్రతిక్షణం టీడీపీ అభివృద్ధి గురించే తన ఆలోచనలు ఉంటాయన్నారు. 50 ఏళ్ల క్రితమే సంగం డెయిరీ వంటి సంస్థను స్థాపించి దానిని అభివృద్ధి చేయటం ద్వారా రైతుసేవలో నిమగ్నమైన మహనీయుడు ధూళిపాళ్ళ వీరయ్య చౌదరి అన్నారు. ఎన్టీఆర్ గొప్ప ఆశయంతో తెలుగుదేశం పార్టీని స్థాపించారన్నారు. ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ సంగం డెయిరీని ఎంతో అభివృద్ధి చేస్తున్నారని కొనియాడారు. డీవీసీ హాస్పటల్‌ను స్థాపించి కార్పొరేట్ వైద్య సేవలను పేదలకు అందిస్తున్నారని హర్షం వ్యక్తం చేశారు. సంగం డెయిరీ, హాస్పటల్‌పై అధికారపక్షం ఎన్నో ఇబ్బందులు పెట్టినప్పటికి మొక్కవోని ధైర్యంతో నరేంద్ర కుమార్ చేస్తున్న పోరాటం ఆదర్శవంతమైన్నదన్నారు. గుంటూరు ఎంపీ గల్లా జయదేవ్ కుటుంబాన్ని ప్రభుత్వం అనేకరకాలుగా ఇబ్బందులు పెట్టి రాజకీయాల నుంచి బయటకు వెళ్లేలా వేధించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక జయదేవ్ వెళ్తే వందమంది జయదేవులు టీడీపీ నుంచి వస్తారని గుర్తుపెట్టుకోవాలని వైసీపీని హెచ్చరించారు. చంద్రబాబులాంటి వ్యక్తిని అవినీతి సొమ్ముతో వ్యవస్థలను మేనేజ్‌చేసి 50 రోజులు జైలులో ఉంచిందని ఆరోపించారు. రాష్ట్రం మేలు కోసం జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ముందుకు వచ్చి తెలుగుదేశం పార్టీకి అండగా నిలపడటం గొప్ప పరిణామం అన్నారు. జనసేన టీడీపీ సంయుక్త ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి రావటానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. పరిచయ వేదిక సభలో పెద్ద సంఖ్యలో హాజరై టీడీపీ నాయకులు, కార్యకర్తలు చంద్రశేఖర్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నియోజక వర్గంలోని మూడు మండలాల టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మద్యం విక్రేత అరెస్టు

పొన్నూరు టౌన్, ఫిబ్రవరి 22: నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు అర్బన్ సీఐ టి.భాస్కర్ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని 19వ వార్డు వీవర్స్ కాలనీలో సోదాలు నిర్వహించారు. తలప్రోలు వెంకటేశ్వరరావు మద్యం విక్రయిస్తున్న సమాచారం తెలుసుకొని ఆరు మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకొని వెంకటేశ్వరరావును అరెస్టు చేసినట్లు సీఐ భాస్కర్ తెలిపారు.



పారిశుధ్య పనులను పర్యవేక్షిస్తున్న మున్సిపల్ ఛైర్‌పర్సన్ రాధిక తదితరులు

సుందర తెనాలికి సహకరించండి

● పట్టణ మున్సిపల్ ఛైర్‌పర్సన్ రాధిక

తెనాలి, మారీసుపేట ఫిబ్రవరి 23: పట్టణ ప్రజలు సుందర తెనాలికి సహకరించాలని పట్టణ మున్సిపల్ ఛైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక కోరారు. స్థానిక బుర్రిపాలెం రోడ్డు 8వ వార్డులో శుక్రవారం మైన్ డ్రైన్‌లోని వ్యర్థాలను ఆక్రమణలను తొలగించి, పూడికతీతను పనులను పట్టణ మున్సిపల్ ఛైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పర్యవేక్షించి సిబ్బందికి పలు సూచలను చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ వార్డులో ఎక్కువ శానిటేషన్ సమస్యలు ఉన్నాయని, ఈ సమస్యలపై ప్రత్యేక ప్రణాళికలను రూపొందించి పరిష్కరిస్తానని అన్నారు. డ్రెయినేజీని ఆక్రమించుకొని ర్యాంపులను కడుతున్నారని, అందువలన వ్యర్థాలు కాల్వలో పేరుకొని మురుగునీరు పారడంలేదని తెలిపారు. వ్యాపారులు, ఇంటి యజమానులు ర్యాంపులను స్వచ్ఛందంగా తొలగించాలని లేకుంటే తామే తొలగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో తాడిబోయిన రమేష్, సచివాలయ సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది, వైసీపీ శ్రేణులు పాల్గొన్నారు.

నేడు జాన్‌గూటెన్‌బర్గ్ జయంతి

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 23: ప్రింటింగ్ యంత్రం పితామహుడు జాన్ గూటెన్ బర్గ్ జయంతి శనివారం జరుగుతుందని ప్రింటర్స్ అసోసియేషన్ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా నెహ్రూ రోడ్డులో అన్నదానం చేస్తామని కార్యదర్శి విశ్వేశ్వరరావు చెప్పారు.

అల్లూరులో జనంలోకి జనసేన



ఆలూరు గ్రామంలో పర్యటిస్తున్న జనసేన నాయకులు

పొన్నూరు టౌన్, ఫిబ్రవరి 22: మండల పరిధిలోని ఆల్లూరులో శుక్రవారం జనంలోకి జనసేన కార్యక్రమాన్ని నిర్వహించారు.. నియోజకవర్గ సమన్వయ కర్త వడ్రాణం మార్కండేయ బాబు ఆధ్వర్యంలో జనసేన శ్రేణులు గ్రామంలో ఇంటింటికీ పర్యటించి జనసేన కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పలువురు జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.



స్వామి వారిని ఊరేగిస్తున్న భక్తులు

పంచముఖ ఆంజనేయస్వామికి మైనాక వాహన సేవ

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 23: శ్రీసువర్చల సమేత పంచముఖ ఆంజనేయస్వామి వార్లకు శుక్రవారం మైనాక వాహన సేవ ఘనంగా నిర్వహించారు. షరాఫ్ బజారులోని ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ నెల 20న ప్రారంభమైన ఉత్సవాలు 26వ తేదీ వరకు జరుగుతాయి. స్వామివారి ప్రత్యేక పూజల అనంతరం జరిగిన వాహనసేవలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. శనివారం శ్రీవారి రథోత్సవం జరుగుతుందని ఈవో శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఆగమ పండితులు రఘురామ్, నాగమారుతీ, శ్రీనివాసమూర్తి, వైదిక క్రతువు నిర్వహించారు.



పూజలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్

వైభవంగా మహాలక్ష్మి అమ్మవారి ఆలయ వార్షికోత్సవం

● పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ల

పెదకాకాని, ఫిబ్రవరి 23: పెదకాకాని మండలం తక్కెళ్ళపాడులో ఉన్న శ్రీమహాలక్ష్మమ్మ అమ్మవారి ఆలయ 8వ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో సంగం డైరీ ఛైర్మన్, మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ పాల్గొన్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపించి, తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో గ్రామ టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.



మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ చేస్తున్న ఎంఈవో సాల్మన్‌రాజు

మధ్యాహ్న భోజనంపై హెచ్ఎంలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

ఎంఈవో సాల్మన్‌రాజు

కొల్లిపర, ఫిబ్రవరి 23: మధ్యాహ్న భోజనం పథకంపై పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎంఈవో సాల్మన్‌రాజు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని పిడపర్రు, కొల్లిపర గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలలను ఎంఈవో ఆకస్మికగా తనిఖీచేశారు. రికార్డులను, మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా సాల్మన్‌రాజు మాట్లాడుతూ విద్యార్థుల ప్రగతిపై తల్లిదండ్రులతో చర్చించాలన్నారు. ప్రతి పాఠశాలలోను ఉపాధ్యాయులు పారిశుధ్యంపై శ్రద్ధ వహించాలన్నారు. పాఠశాలల్లో సమస్యలు ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలన్నారు.

ఆంధ్రజ్యోతి
దినపత్రికలో అన్ని రకముల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
సంప్రదించండి 99854 11227 99854 02292



పెదకాకాని సెంటర్లో ధర్నా చేస్తున్న సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకులు

రైతులకిచ్చిన హామీలు అమలుచేయాలంటూ

పెదకాకానిలో సీఐటీయూ, ఏఐటీయూసీ ధర్నా

పెదకాకాని, ఫిబ్రవరి 23: రైతులకు ఇచ్చిన హామీలను అమలుచేయాలంటూ పెదకాకాని రైతు కార్మిక సంఘాల పిలుపుమేరకు శుక్రవారం పెదకాకాని సెంటర్ ఎన్టీఆర్ చౌక్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి గుంటూరు జిల్లా ఏఐటీయూసీ నాయకులు పుప్పాల సత్యనారాయణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జిల్లా సీఐటీయూ కార్యదర్శి నన్నపనేని శివాజీ, రైతు కూలి సంఘం నాయకులు దానబోయిన భాస్కరరావులు మాట్లాడుతూ కేంద్రంలో మోడీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వానికి దగ్గర పడ్డాయని హెచ్చరించారు. ఢిల్లీ రైతు ఉద్యమ రైతులపై పోలీసులు చేసిన దాడిలో రైతు శుభ్‌కరణ్‌సింగ్‌ను కేంద్ర ప్రభుత్వం బలితీసుకుందన్నారు. రైతు ఉద్యమంపై నరేంద్ర మోడీ ప్రభుత్వ నిరంకుశ వైఖరిని ఆంధ్రప్రదేశ్ రైతులు కౌలురైతులు కార్మిక సంఘాలు తీవ్రంగా ఖండిస్తున్నాయన్నారు. రైతు ఉద్యమం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం రాతపూర్వకంగా రైతులకు ఇచ్చిన హామీలను అమలుచేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా సమైక్య కార్యదర్శి రెంటాల కుమారి వెనిగండ్ల గ్రామ సీపీఐ కార్యదర్శి బుల్లా బాబురావు దర్శి లింగారావు సీహెచ్ విజయలక్ష్మి గోపి సుబ్బారావు ఏ కృష్ణ సీఐటీయూ నాయకులు రాజారమేష్ వి.శివయ్య, సాంబయ్య, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అష్టదళ పాదపద్మారాధన

● పాల్గొన్న దత్తపీఠ ఉత్తరాధికారి శ్రీదత్త విజయానంద




ప్రత్యేక పూజలు అనంతరం తీర్థం ఇస్తున్న దత్త విజయానంద తీర్థ స్వామీజీ

పెదకాకాని, ఫిబ్రవరి 23: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎదుట గల ఉన్న దశావతార వేంకటేశ్వర స్వామివారి దివ్య క్షేత్రానికి శ్రీఅవధూత దత్త పీఠ ఉత్తరాధికారి శ్రీదత్త విజయానందతీర్థ స్వామీజీ (బాల స్వామీజీ) శుక్రవారం ఆలయాన్ని దర్శించారు. ఆయన చేతుల మీదుగా స్వామివారికి అష్టదళ పాదపద్మారాధన పూజను చేసి భక్తులకు అనుగ్రహ భాషణం చేశారు. కార్యక్రమంలో ఆలయ నిర్మాణ దాత లింగమనేని పూర్ణ భాస్కర్ రావు దంపతులు, లింగమనేని రాజశేఖర్, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలపై విస్తృత ప్రచారం: బీజేపీ

పొన్నూరు టౌన్, ఫిబ్రవరి 22: కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నట్లు బీజేపీ ప్రజాపోరు జిల్లా కన్వీనర్ మొకరం శివ అన్నారు. శుక్రవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్ర ఆదేశాలతో మండల పరిధిలోని ఉప్పరపాలెం వల్లభరావుపాలెం, సీతరామపురం, కసుక్రరు గ్రామాల్లో ప్రజాపోరు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వడ్రాణం ఉదయ్, అసెంబ్లీ ఇన్‌చార్జి చలపతిరావు, పాండురంగ విఠల్, ఎ.నాగేంద్ర, వి.సుధాకర్, కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రింటర్స్ డే శుభాకాంక్షలు
(ఫిబ్రవరి 24)



జొహన్నెస్ గూటెన్ బర్గ్ గారు
అచ్చు యంత్రం కనిపెట్టిన పితామహులు

అచ్చు యంత్రం కనిపెట్టిన పితామహులు జొహన్నెస్ గూటెన్ బర్గ్ గారికి జయంతి శుభాకాంక్షలు...

		వాణి ఆర్ట్స్ ప్రింటర్స్, ప్రెసిడెంట్: డి. శివశంకరరావు, ఎ.పి. మాస్టర్ ప్రింటర్స్ అసోసియేషన్, తెనాలి, మార్కెండేయుల గుడి ఎదురు, తెనాలి. సెల్: 9440358752
శ్రీ సురేష్ ప్రింటర్స్, సెక్రటరీ: సుందర విశ్వేశ్వరరావు, ఎ.పి. మాస్టర్ ప్రింటర్స్ అసోసియేషన్, తెనాలి. సెల్: 9440857014	సాయిక ఫ్లెక్స్ & ఆఫ్‌సెట్ ప్రింటర్స్, V.V.S. ప్రకాష్ V. నాగమల్లేశ్వరరావు, గాంధీచౌక్, తెనాలి. 98850 60059, 9290539044	శ్రీ శివ డిజిటల్స్ & ఫ్లెక్స్ ప్రింటింగ్, ఆర్. సుబ్బారావు - 9618171364, ఆర్. శివశంకర్ - 9849820254
అశోక ఆఫ్‌సెట్ ప్రింటర్స్, ప్రొ.: డి. అమీర్‌నాథ్, గంగానమ్మపేట, ఆంజనేయ పంతులు వీధి, తెనాలి, సెల్: 9441080962	శ్రీపద్మలత ఆర్ట్ ప్రింటర్స్, ప్రొ.: డి. ప్రకాశరావు, ముత్తెంశెట్టిపాలెం, తెనాలి, సెల్: 9985527135	చంద్రశేఖర ప్రింటర్స్, ప్రొ.: డి. సుధాకర్, ఆటోనగర్, తెనాలి. సెల్: 9848115072, 222772
శ్రీ తిరుమల ఫ్లెక్స్ & ఆఫ్‌సెట్ ప్రింటర్స్, JS. సుబ్రహ్మణ్యం, రామలింగేశ్వరపేట, తెనాలి. సెల్: 9247129727	శ్రీసాయిరాం ఆఫ్‌సెట్ & బైడింగ్ వర్క్స్, ఎ. వీరాంజనేయులు, సెల్: 9347646226	గాయత్రి నిరంజన ట్రేడర్స్ (వెడ్డింగ్ కార్డ్స్ షోరూం), KVVN త్రినాథ్ గుప్త, తెనాలి, సెల్: 9848730505

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా — కన్నావారితోట బ్రాంచి
96-1-95, మెయిన్‌రోడ్, నగరంపాలెం, కన్నావారితోట, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522004. ఫోన్: 9324502421

ఇ-వేలం అమ్మకపు ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8(6) నిబంధనలతో చదవబడు సెక్యూరిటైజేషన్ & రికన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకానికి ఇ-వేలం ప్రకటన.

ఇందుమూలంగా సాధారణ ప్రజానీకానికి ముఖ్యంగా ఋణగ్రహీతలు / సహహామీదారులు / తనఖాదారులు / హామీదారులకు నోటీసు ద్వారా తెలియజేయునది ఏమనగా ఈ దిగువ పేర్కొనబడిన ఋణగ్రహీతలు / సహహామీదారులు / తనఖాదారులు / హామీదారుల నుండి సెక్యూరిటీ క్రెడిటార్ అనగా పూర్వము ఆంధ్రాబ్యాంక్, ఇప్పుడు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా దిగువ పేర్కొనబడిన బకాయిమొత్తము రాబట్టుకొనుటకు సెక్యూర్డ్ క్రెడిటార్ అయిన పూర్వము ఆంధ్రాబ్యాంక్, ఇప్పుడు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కన్నావారితోట బ్రాంచి యొక్క అధీకృత అధికారిచే స్వాధీనం చేసుకున్న, సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తనఖాపెట్టిన / ఛార్జి చేసిన దిగువ వివరించిన స్థిరాస్తులను "ఎక్కడ ఎలా ఉన్నది" "అక్కడ అలా" మరియు "అక్కడ ఏమున్నదో అది" అనే ప్రాతిపదికన ది.14.03.2024న విక్రయించబడును. రిజర్వుధర మరియు బయానా వివరములు దిగువ పేర్కొనబడిన ఆస్తుల దగ్గర పేర్కొనబడినవి.

1 ఋణగ్రహీతలు / తనఖాదారులు / హామీదారులు: (1) మెస్సర్స్ విజయ మారుతి కాటన్స్, యజమాని: శ్రీమతి నెలకుర్తి లక్ష్మి, బృందావన్ ఎన్‌క్లేవ్ అపార్ట్‌మెంట్స్, ఆర్కిడ్ సౌత్ బ్లాక్, ఫ్లాట్ నెం.జి1, సంగడిగుంట, ఏటుకూరు రోడ్డు, గుంటూరు-522003. (2) శ్రీమతి నెలకుర్తి లక్ష్మి, భర్త: యస్.శ్రీనివాసరావు, డోర్ నెం. 19-18-30ఎ/101, సంగడిగుంట, గుంటూరు-522004. (3) శ్రీ నెలకుర్తి శ్రీనివాసరావు, తండ్రి: పేరయ్య, డోర్ నెం. 19-18-30ఎ/101, సంగడిగుంట, గుంటూరు-522004. (హామీదారు). బకాయిసొమ్ము: 03-03-2020 తేదీ నాటికి చెల్లించవలసిన బకాయిమొత్తము రూ.50,79,460.92 (అక్షరాల యాభై లక్షల డెబ్బై తొమ్మిది వేల నాలుగు వందల అరవై రూపాయలు మరియు తొంభై రెండు పైసలు మాత్రమే) + తదుపరి వడ్డీ, వ్యయాలు మరియు ఛార్జీలు.

స్థిరాస్తి యొక్క వివరణ

ఆస్తి-1: గుంటూరు, శారదాకాలనీ, డి.నెం.189/బి7-17-449/4, శ్రీ సాయి విల్లా అపార్ట్‌మెంట్, గ్రౌండ్ ఫ్లోర్‌లో శ్రీమతి నెలకుర్తి లక్ష్మికి చెందిన (30-07-2015 తేదీగల దస్తావేజు నెం.8136/2015) 1150 చ॥అ॥ విస్తీర్ణములోని ఫ్లాట్ నెం.108 ఫ్లాట్ యావత్తు. దీనికి హద్దులు: తూర్పు: ఉమ్మడి వరండా; పడమర : ఉమ్మడి వరండా; ఉత్తరం : గ్రౌండ్ లోని ఓపెన్ ఏరియా; దక్షిణం: గ్రౌండ్ లోని ఓపెన్ ఏరియా. ప్రాజెక్టుకు హద్దులు: తూర్పు: 40అ॥ వెడల్పుగల మునిసిపల్ రోడ్డు; పడమర : మిస్ మేరీ ఫాతిమా యొక్క స్థలము ఆస్తి; ఉత్తరం : ఇతరుల యొక్క ఆస్తి; దక్షిణం: 15 అ॥ వెడల్పుగల రోడ్డు.

రిజర్వుధర: రూ.25,11,000/-; బయానా: రూ.2,51,000/-; బిడ్ పెంపుదల: రూ.25,000/-

ఆస్తి-2: గుంటూరు, గుంటూరు మునిసిపల్ కార్పొరేషన్, సంగడిగుంట, ఏటుకూరు రోడ్డు, న్యూ డోర్ నెం.68-168, డి.నెం.19-8-30, బృందావన్ ఎన్‌క్లేవ్ అపార్ట్‌మెంట్, ఆర్కిడ్ సౌత్‌బ్లాక్, గ్రౌండ్ ఫ్లోర్‌లో శ్రీమతి నెలకుర్తి లక్ష్మికి చెందిన (23-11-2006 తేదీగల విక్రయ దస్తావేజు నెం.17512/2006) ఫ్లాట్ నెం.1 రెసిడెన్షియల్ ఫ్లాట్ యావత్తు. దీనికి హద్దులు: తూర్పు: శూన్యాకాశము; పడమర : ఉమ్మడి వరండా; ఉత్తరం : శూన్యాకాశము; దక్షిణం: శూన్యాకాశము. ప్రాజెక్టుకు హద్దులు: తూర్పు: మునిసిపల్ ఓపెన్ డ్రెయిన్; పడమర : మునిసిపల్ కార్పొరేషన్ రోడ్డు; ఉత్తరం : మునిసిపల్ ఓపెన్ డ్రెయిన్; దక్షిణం: BSNL & ఇతరుల ఆస్తి.

రిజర్వుధర: రూ.22,27,000/-; బయానా: రూ.2,23,000/-; బిడ్ పెంపుదల: రూ.22,000/-

ఇ వేలం యొక్క తేదీ మరియు సమయం: 14-03-2024 మ॥ 3.00 గం॥ నుండి సా॥ 5.00 గం॥ల వరకు (ప్రతి 10 నిమిషాల అపరిమిత పొడిగింపులతో)
ఇ-వేలం వెబ్‌సైట్: www.mstcecommerce.com

అమ్మకానికి సంబంధించిన సవివరమైన నియమ నిబంధనల కొరకు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారు అందించిన వెబ్‌సైట్ లింక్ అనగా www.unionbankofindia.co.in / https://www.ibapi.in నందు సందర్శించండి.

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 8(6)/ రూల్ 9(1) క్రింద చట్టబద్ధమైన 15 రోజుల అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 8(6)/ రూల్ 9(1) క్రింద దీనిని నోటీసుగా కూడా పరిగణించబడుతుంది. పైన తెలిపిన ఋణంకు సంబంధించి పైన పేర్కొన్న తేదీలో ఇ-వేలం విక్రయం నిర్వహించబడునని ఋణగ్రహీతలు / హామీదారులకు తెలియజేయడమైనది.

తేది : 23-02-2024
ప్రదేశం : గుంటూరు

సం/- ఛీఫ్ మేనేజర్ & అధీకృత అధికారి
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా